మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

13.03.2025
గురువారం Thursday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 329
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


## రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే..



07



# అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు

## రైతుల అభివృద్ధికి అనేక రకాల చర్యలు



- రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల అమలు
- రికార్డుస్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి
- గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచింది
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు
- అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్.. సభకు కెసిఆర్ హాజరు

**హైదరాబాద్, జనతా న్యూస్:** అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసిం చారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి.

మిగతా 2 లో



## 27 వరకు అసెంబ్లీ

- 17,18 తేదీల్లో బీసీ రిజర్వేషన్లపై చర్చ
- 19న బడ్జెట్.. 21, 22 తేదీల్లో చర్చ
- నాలుగు రోజులు మినహాయించి..
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

02

# ప్రభుత్వవిద్యారంగం తీరు అధ్వాన్నం

## ప్రైవేటు రంగంతో పోటీపడలేక పోతున్నారు



02

- విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాం
- కళాశాలను తీర్చిదిద్దాలి
- గత పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం
- అధికారంలోరి రాగానే 55 రోజుల్లో నియామకాలు

తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని.. కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పకొచ్చారు.



## అసెంబ్లీకి విధిగా హాజరు కావాలి

- ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి
- సీఎల్పీ భేటీ సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, జనతా న్యూస్:** అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో

మిగతా 2 లో



## అసెంబ్లీకి కేసీఆర్ హాజరు

స్వాగతించిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

02


## డిలిమిటేషన్‌పై త్వరలో అఖిలపక్షం



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ

## సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

- ఇద్దరు మహిళా జర్నలిస్టుల అరెస్ట్





04



గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా

## గవర్నర్ ప్రసంగం

- గవర్నర్ చేత అన్నీ అబద్దాలు చెప్పించారు
- పంటలు ఎండుతున్నా ఎక్కడా ప్రస్తావన లేదు
- కెటిఆర్ విమర్శలు



## తెలంగాణ ప్రతినిధుల విషయం తేల్చండి

ఏపీ సీఎం చంద్రబాబుకు కొండా సురేఖ లేఖ

02

## 10 వేలకు పైగా పెండింగ్ పిటిషన్లు


- ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి
- త్వరలో కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

02



"ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్ రాబోతోంది. ప్రజావాణికి సంబంధించి ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా ఇంకా పెండింగ్ పిటిషన్లు 10 వేలకు పైగా ఉన్నాయి. ప్రతి సమస్య క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి. పాలనను ప్రజలకు దగ్గర చేయడానికి, క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకోవడానికి ప్రజావాణి గొప్ప సాధనం." అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.

## తెలంగాణలో మండే కాలం



- ఎండల తీవ్రత పెరుగుతోంది
- వాతావరణశాఖ హెచ్చరిక

02

## పాక్‌లో రైలు హైజాక్ కేసు



02

**30మంది మిలిటెంట్లను హతమార్చిన బలగాలు**

పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతాబలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## తెలంగాణ ప్రతినిధుల విషయం తేల్చండి

**హైదరాబాద్, మార్చి 12:** తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల అమలు విషయమై తితిదే అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విన్నవించారు. ఈ మేరకు ఆమె బాబుకులేఖ రాశారు. 'తిరుమల వెంకన్న దర్శనం కోసం తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సిఫార్సు లేఖలను అనుమతించాలని నిర్ణయించడం సంతోషం కలిగించింది. అయితే, తితిదే అధికారులు మీ ఆదేశాలను సరిగ్గా పట్టించుకోవడం లేదు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈ విషయంలో తితిదేకు సత్వరమే సూచనలు ఇవ్వాలని కోరుతున్నాం' అని చంద్రబాబుకు ఆమె విజ్ఞప్తి చేశారు.

## డిలిమిటేషన్‌పై త్వరలో అఖిలపక్షం: భట్టి



**హైదరాబాద్, మార్చి 12:** నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. రాజకీయ పార్టీలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం' అని లేఖలో పేర్కొన్నారు.

## 10 వేలకు పైగా పెండింగ్ పిటిషన్లు

**హైదరాబాద్, మార్చి 12:** ప్రజావాణికి సంబంధించి ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా ఇంకా 10 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. విజ్ఞప్తుల్లో 66 శాతం పరిష్కరించగలిగామని, ఒక్కో రోజు వేలాది మంది ప్రజలు వస్తున్నారని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ప్రజావాణి, ప్రజాపాలనపై ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజావాణి సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిపై, అలాగే చెరువుల పరిస్థితి, పట్టణీకరణ, హైడ్రా పనులపై రంగనాథ్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

### త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్

పాలనను ప్రజలకు దగ్గర చేయడానికి, క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకోవడానికి ప్రజావాణి గొప్ప సాధనమని, హైడ్రాకు సంబంధించి 263 ఫిర్యాదులు వచ్చాయని రంగనాథ్ తెలిపారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతోందని, ఆన్ లైన్ ద్వారా కూడా ఫిర్యాదులు తీసుకునేందుకు యత్నిస్తామని ఆయన అన్నారు.

### త్వరలో కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తాం

ప్రజావాణిని వికేంద్రీకరించి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో సమస్యలకు మూల కారణాలు కనుగొని పరిష్కరిస్తున్నామని ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ చెప్పారు. 30 రోజుల్లోగా ప్రతీ ఫిర్యాదుపై చర్య తీసుకునేలా చూస్తున్నామని, త్వరలో కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు 110 ప్రజావాణిలు నిర్వహిస్తే 53 వేలకు పైగా విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు.

## తెలంగాణలో మండే కాలం

### ఎండల తీవ్రత పెరుగుతోంది.. వాతావరణశాఖ హెచ్చరిక

**హైదరాబాద్,మార్చి12 :** మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్దిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

## 2601 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్

**న్యూఢిల్లీ, మార్చి 12:** భారత్‌లోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అరెస్టు చేసినట్లు 2024 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజ్యసభలో ఈమేరకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత్-బంగ్లా సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ, సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటివి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్‌ఎఫ్ నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని వెల్లడించారు. గతేడాది ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పతనమైన అనంతరం తాజాగా ఇరు దేశాల భద్రతా బలగాల అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారుల మధ్య చర్చలు జరిగాయని మంత్రి తెలిపారు.

# అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు

మొదటి పేజీ తరువాయి




ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగ్రశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత ప్రభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నామని గవర్నర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశారు.

## 27 వరకు అసెంబ్లీ సమావేశాలు



**హైదరాబాద్, మార్చి 12:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27 వరకు జరుగుతాయి. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు మినహాయించి 12 రోజులు సమావేశాలు జరగబోతున్నాయి. చాలా రోజుల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటారని కెటిఆర్ ఇప్పటికే ప్రకటించారు. అటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. కీలకమైన బడ్జెట్ ను 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెడుతారు. 20వ తేదీన సెలవు కాబట్టి 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చిస్తారు. 24 , 25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడుతారు. ఈ సమావేశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం బీసీలంతా ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో బీసీ రిజర్వేషన్ల కోటాపై స్పష్టత వస్తే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. అంతే కాకుండా కేసీఆర్ ఓడిపోయిన తర్వాత మొదటిసారి అసెంబ్లీలో ప్రసంగించబోతున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానాలు చెప్పాలని రేవంత్ ప్రభుత్వం కసరత్తులు స్టార్ట్ చేసింది. కాబట్టి గతంలో జరిగిన సమావేశాల కంటే ఈ సమావేశాలు మరింత వేడెక్కడం ఖాయం. స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో అసెంబ్లీ పనిదినాలపై చర్చించారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. దానిపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. అలాగే 14న హోలీ పండుగ నేపథ్యంలో సెలవు ప్రకటించారు. 16న ఆదివారం. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరుగనుంది. 21నబడ్జెట్‌పై చర్చించనున్నారు. అలాగే మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపుతారు. దాదాపు 11 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. కనీసం 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్ దృష్టికి బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లారు. అయితే ఈనెల 27 వరకు సభను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బిజెపి నుండి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్



**హైదరాబాద్, మార్చి 12:** కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యారు. దాదాపు 50 నిమిషాలు ముందుగానే అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు. అయితే గత పదిహేను నెలలుగా ప్రధాన ప్రతిపక్షనేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావడంలేదన్న విమర్శల నేపథ్యంలో.. ఈసారి అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయించుకున్నారు. . ఇందులో భాగంగా 50 నిమిషాలు ముందుగానే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. ముందుగా అసెంబ్లీ ఇన్నర్ లాబీలోని బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత సమావేశమయ్యారు. అయితే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినా పలువు పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు సమయానికి సభకు రాలేదు. మరోవైపు బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రతిపక్షనేత కేసీఆర్‌ను అశ్వారావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణ కలిశారు. మర్యాదపూర్వకంగానే కేసీఆర్‌ను కలిశానని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో ఆదినారాయణ బీఆర్ఎస్‌లో పనిచేశారని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అయితే అసెంబ్లీ లాబీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాజీ మంత్రి కేటీఆర్ (ఈనీసప।స ఓతినితిబబి।స ఐ÷ఖీ) ముచ్చటించారు. ముఖ్యమంత్రి పేరు ఏంటంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదినారాయణను అడిగారు కేటీఆర్. రేవంత్ రెడ్డి అంటూ ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. అయితే బీఆర్ఎస్ ప్రోడక్ట్ కాబట్టి సరైన సమాధానం చెప్పారంటూ కేటీఆర్ టీజ్ చేశారు.

# అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి

మొదటి పేజీ తరువాయి



వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదు. ఒకసారి గెలవడం గొప్పకాదు. మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప. చాలా మంది బీఆర్ ఎస్ పట్ల సైలెంట్ గా ఉంటున్నారు. అలా చేస్తే మీ మీద అభ్యర్థిని పెట్టరు అనుకుంటున్నారా.. అలా అస్సలు ఊహించుకోకండి. వాళ్ల గురించి నాకు బాగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు సీఎం రేవంత్.మీటింగ్ మధ్యలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ బయటకు వెళ్లడంపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. 'ఓ వైపు నేను ఇంత సీరియస్ గా మాట్లాడుతుంటే అతనేంటి అలా వెళు_న్నారు. ఇంత నాన్ సీరియస్ గా ఉంటే ఎలా.. మనం మరోసారి గెలవాలంటే చాలా సీరియస్ గా పనిచేయాల్సిందే. రాజకీయాలు అంటే పిల్లలాటలు కాదు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుంది. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దు. ఇక నుంచి అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలి. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందాం. అందరి పనితీరుపై చర్చిద్దాం' అంటూ సీరియస్ గా క్లాస్ తీసుకున్నారు.

# ప్రభుత్వ విద్యారంగం తీరు అధ్వాన్నం

**ప్రైవేటు రంగంతో పోటీపడలేక పోతున్నారు**

**విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాం**

**లెక్చరర్లు కళాశాలను తీర్చిదిద్దాలి**

**గత పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం**

**అధికారంలోరి రాగానే 55 రోజుల్లో నియామకాలు**

**ఉద్యోగ నియామకపత్రాలు అందించిన సిఎం రేంవత్**



హైదరాబాద్, మార్చి 12: తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని.. కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు పరిష్కరిస్తున్నా మన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని.. అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే..ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని.. వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు. ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్‌తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు. 55 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని.. అది వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ. 11000 కోట్లు కేటాయించామని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు మన దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామన్నారు. పారాలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కొంతమంది స్టేచ్రర్ స్టేచ్రర్ అని మాట్లాడుతున్నారని.. స్టేచ్రర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారన్నారు. స్టేచ్రర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదని తెలిపారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అని అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని.. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారని.. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారని అన్నారు. తాను వాస్తవాలు చెబుతుంటే? దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్‌లా అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. 'అబద్దాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం. ఎంతసేపు సీఎం కుర్చీని లాక్కుంటామంటే ఎలా.. నన్ను పనిచేయనివ్వాలి కదా మీరు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిఎస్ శాంతికుమారి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం



**హైదరాబాద్, మార్చి 12:** గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేలవమైన, అట్టర్‌ఎ÷-లాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునేవిధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందేమోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీ ఇష్టం.. అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటి వెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు. పెట్టుబడి సాయం అందని రైతులు, రుణమాఫీ కాక.. కేసీఆర్ హయాంలో ఉన్న రైతుబంధును సైతం కనీసం అమలు చేసే పరిస్థితి లేక ఆగమాగమైపోతుంటే.. రైతుబంధు మొత్తం అందింది.. అది మాత్రమే కాకుండా రైతు కూలీలకు సహాయం చేస్తున్నామని గవర్నర్ నోటి వెంట అబద్దాలు చెప్పించడమంటే గవర్నర్‌కు కూడా అవమానం. గవర్నర్ దీన్ని గుర్తించాలి. సాగునీటి సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతుంది. కేసీఆర్‌పై ద్వేషంతో, బీఆర్ఎస్‌పై గుడ్డి కోపంతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా 15 నెలలు ఎండపెట్టడం వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎండిపోతున్న ప్రతి ఎకరా పంటకు బాధ్యత తీసుకోవాల్సింది రేవంత్‌రెడ్డి అనే ఈ ముఖ్యమంత్రి. రేవంత్‌రెడ్డి అనే చేతగాని ముఖ్యమంత్రి వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. పంట ఎండిపోయి రైతులు అవస్థలుపడుతున్న రైతులు.. పంటలకు నిప్పుపెట్టుకుంటున్నరు రైతులు, పొలాల్లో గొర్రెలు మేకలను మేపుతున్న రైతులు గవర్నర్ ప్రసంగం నుంచి ఒక్క మాట కోసం ఇవాళ ఎదురుచూశారు. మేం పంటలు ఎండిపోకుండా కాపాడుతాం.. మేం ఉన్నాం.. ఈ ప్రభుత్వం మీకు భరోసా ఇస్తుంది. మేడిగడ్డను రిపేర్ చేస్తాం. ఇన్నిరోజులు కేసీఆర్‌పై కోపంతో తప్పు చేశామని ప్రాయశ్చిత్తం చేసుకుంటరనుకున్నామని.. కానీ, ఆ సోయి ఈ ప్రభుత్వానికి లేదు. కనీసం ఒక మాట మాత్రంగా కూడా ఎండుతున్న పంటలు, సాగునీటి సంక్షోభం.. 480 మంది రైతుల ఆత్మహత్యలపై ఒక్కమాట మాట్లాడకపోవడం అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యతలు ఎట్ల ఉన్నయో దీన్ని బట్టే తెలుసుకోవచ్చని అంటూ కేటీఆర్ విమర్శించారు.

# జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై త్వరలో సమావేశం

- **టీయూడబ్ల్యూజే బృందానికి మంత్రి దామోదర్ హామీ**



**హైదరాబాద్ :** రాష్ట్రంలో జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి.దామోదర్ రాజ నరసింహ హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం అసెంబ్లీలోని ఛాంబర్ లో మంత్రి దామోదర్ రాజ నర్సింహాను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది. అంతే కాకుండా వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో జర్నలిస్టులు అనుభవిస్తున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అసలే ఆర్థిక కష్టాలతో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు, వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జర్నలిస్టులు వైద్యం పొందే పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లుూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

# 20 రోజులు అసెంబ్లీ జరపాలి

## బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశాం : హరీష్ రావు



**హైదరాబాద్, మార్చి 12:** కనీసం 20 రోజులు అసెంబ్లీ నడపాలని బీఏసీలో డిమాండ్ చేశామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. బీఏసీ సమావేశం తర్వాత మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాజీ మంత్రి మాట్లాడుతూ.. ప్రశ్నా పత్రాలు లీక్ అయినట్లు.. అసెంబ్లీ బిజినెస్ ముందే లీక్ అవటంపై అభ్యంతరం తెలిపామన్నారు. ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వొద్దని సీఎం స్వయంగా స్పీకర్‌ను బుల్డోజ్ చేస్తున్న విషయాన్ని బీఏసీలో లేవనెత్తామని తెలిపారు. సంఖ్యా బలాన్ని బట్టి బీఆర్ఎస్‌కు సభలో సమయం ఇవ్వాలని కోరామన్నారు. తమ విజ్ఞప్తికి అంగీకారం తెలిపారన్నారు. రైతాంగ సమస్యలు, తాగు సాగు నీటి సమస్యలపై చర్చించాలని కోరామని.. వివిధ ప్రాజక్టులు కూలిపోవటంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశామన్నారు. మంత్రులు సభకు ప్రిపేర్ అయ్యి రావాలని కోరామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి స్పీకర్ చొరవ తీసుకుని నిధులు ఇప్పించాలని కోరినట్లు చెప్పారు. నదీ జలాల వినియోగంలో విఫలం రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఏసీలో చెప్పామన్నారు. ఏపీ నీళు ్ళ తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూసిందని విమర్శించారు. బిల్లులు చెల్లింపుకు 20 శాతం కమిషన్ విషయాన్ని అసెంబ్లీలో చర్చించాలని కోరినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవటం చర్చించాలని, బార్స్, వైన్స్, బెల్ట్ షాపులు పెంచటంపై చర్చించాలని కోరినట్లు చెప్పారు. ఎల్ఆర్ఎస్ ఉచిత హామీపై చర్చ జరపాలని డిమాండ్ చేశామన్నారుర. కాళేశ్వరం ప్రాజెక్టును కూలిన పిల్లర్‌ను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని బీఏసీలో చెప్పామన్నారు. నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్ పై అసెంబ్లీలో చర్చించాలని బీఏసీలో కోరినట్లు హరీష్ రావు వెల్లడించారు.

# గవర్నర్ ప్రసంగంలో పస లేదు

## బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి12 :** గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామని.. ప్రసంగమంతా పూర్తి డొల్ల అని అసెంబ్లీలో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు చేసినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవం అన్నారు. ఏవీ ఇవ్వకున్నా.. అన్ని ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా? అని నిలదీశారు. అబద్దాల పునాదుల మీద ప్రసంగం ఉందని.. నిరుద్యోగ సాధికారిత అని మోసపూరిత మాటలు గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారని విమర్శించారు. బీఏసీలో సమస్యలపై చర్చకు ఎక్కువ రోజులు చర్చించేందుకు అసెంబ్లీ నడవాలని కోరామన్నారు. కేవలం ఐదురోజుల్లో ప్రజా సమస్యలపై, బిల్లులపై చర్చ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

# గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదు

## గ్యారెంటీలపై గాంధీ కుటుంబం హామీ ఇవ్వాలి: కవిత





**హైదరాబాద్, మార్చి 12:** గవర్నర్ ప్రసంగంలో కొత్తదనం ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అంటూ ప్రశ్నించారు. ప్రభు త్వం విఫలమవుతున్న నేపథ్యంలో గాంధీ కుటుంబం బాధ్యత తీసుకోవాలన్నారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని.. స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదన్నారు. బాధ్యత తీసుకొని గాంధీ కుటుంబం తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో గాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని.. అబద్దాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని విమర్శించారు. సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామన్నారు. రూ.లక్షా50వేల కోట్ల అప్పులు చేసినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీని విస్మరించిందని మండిపడ్డారు.

# శ్రీ చైతన్యలో మూడోరోజూ దాడులు




**హైదరాబాద్,మార్చి12 :** శ్రీ చైతన్య విద్యా సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు మూడో రోజూ కొనసాగాయి. విద్యా సంస్థల అధినేత బొప్పన సత్యనారాయణ రావు, ఆయన కుటుంబసభ్యుల నివాసాల్లో ఐటీ అధికారుల సోదాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా ఆయన కుమార్తెలైన బొప్పన సుష్మ, బొప్పన సీమ ఇళ్లలో కూడా ప్రత్యేక దర్యాప్తు జరుగుతోంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 32, రోడ్ నెంబర్ 10లో ఉన్న బొప్పన సుష్మ, బొప్పన సీమ నివాసాల్లో ఐటీ అధికారులు మరింత తీవ్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, సోదాల సమయంలో ఇద్దరు డైరెక్టర్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. వారిరివురు వచ్చిన తర్వాత ఐటీ శాఖ మరోసారి వారి నివాసాల్లో తనిఖీలు నిర్వహించే అవకాశముందని సమాచారం. విద్యా సంస్థల ద్వారా ఆదాయపు పన్ను మోసం చేసి, ఆ నిధులను మరొకచోటికి మళ్లించారని అనుమానం నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఆస్తులపై మరిన్ని దర్యాప్తులు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. విద్యా రంగంలో పేరొందిన సంస్థపై ఈ స్థాయిలో ఐటీ దాడులు జరగడం గమనార్హం. అధిక మొత్తంలో ఆదాయపు పన్ను ఎగవేశారని, ఆ నిధులను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని అనుమానంతో అధికారులు జాగ్రత్తగా అన్ని లావాదేవీలను పరిశీలిస్తున్నారు. సోదాల అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.




# ప్రధాని మోడీకి ప్రత్యామ్నాయం ఏదీ!

దేశ రాజకీయాల్లో ఇప్పుడు నిస్తేజం ఆవరించింది. బిజెపిని ఢీకొనేందుకు ఏర్పడ్డ ఇండియా కూటమి షెడ్డుకు చేరింది. కూటమిగా పనిచేసేందుకు అందులోని పార్టీలు ముందుకు రావడం లేదు. ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా పార్టీల వ్యవహారం సాగుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ నిర్మానాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం కుదరడం లేదు. టిఎంసి,డిఎంకె పార్టీలు పార్లమెంటులో సొంత ఎజెండాతో పోతున్నాయి. వాటికి అవసరమైన మేరకు ఆందోళన చేస్తున్నాయి. డిఎంకె జాతీయ విద్యావిధానం, హిందీ వ్యతిరేకతపైనే రాజకీయాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అవతకవలు, ఓటరల జాబితాపై పోరాడుతోంది. మొత్తంగా అన్ని పార్టీల్లోనూ సొంత ఎజెండాలే తప్ప ప్రజల ఎజెండా కానరావడం లేదు. పార్లమెంటులో ప్రజల పక్షాన నిలిచామని చెప్పుకోవడానికి ఈ పార్టీలు పనిచేయలేక పోతున్నాయి. రెండోదఫా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంశాలపై నిలదీసే కార్యక్రమంకానరావడం లేదు. నాయకుడిగా రాహుల్ ఇంకా పరిణతి చెందలేదు. పార్టీ పెత్తనాన్ని అట్టిపెట్టుకోవడం మినహా దేశాన్ని నడిపించే సత్తా ఉందని నిరూపించుకోలేక పోతున్నారు. రాహుల్‌తో పోలిస్తే ప్రియాంక కొంత చు-రుకుగా ఉంటున్నారు. ఇకపోతే ఢిల్లీ ఎన్నికల ఫలితాల తరవాత ఆప్ ఓటమితో..ప్రత్యామ్నాయ రాజకీయాలకు గండిపడింది. ఆప్ అవినీతి కారణంగా ప్రజలు ఇతర పార్టీలను నమ్మే విధంగా లేరు. దీంతో బిజెపికి తీరుగులదేన్న విధంగా పరిస్థితి మారుతోంది. డబుల్ ఇంజన్ అంటూ మోడీ చేసిన ప్రచారం బాగా పనిచేసిందనే చెప్పాలి. అలాగే మోడీ కాంగ్రెస్ ముక్త భారత్ నినాదానికి మరింత బలం చేకూరింది. మోడీ నాయకత్వానికి తిరుగులేదని నిరూపితం అయ్యింది. బిజెపియే దేశానికి రక్ష అన్న వాదనకు కూడా బలం చేకూరింది. ఇదే సందర్భంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు అంటూ బయలుదేరిన పార్టీలకు ఈ ఫలితాలు ఎదురుదెబ్బగానే భావించాలి. ప్రత్యామ్నాయ రాజకీయాలకు పెద్దగా అనుకూలం కాదని తేలింది. కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలను ప్రజలు ఆమోదించడం లేదని వరుస పరిణామాలు రుజువు చేశాయి. అలాగే కాంగ్రెస్ నాయకత్వం మారాల్సిన అవసరాన్ని గుర్తించాలి. రాహుల్, ప్రియాంకలు కాంగ్రెస్ నావను గట్టెక్కించలేరని కూడా తేలిపోయింది. మోడీ ఛరిష్మా తగ్గలేదని కూడా ఢిల్లీ ఫలితాలు మరోమారు రుజువు చేస్తున్నాయి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ మోడీ చేసిన ప్రచారం ప్రజలను ఆలోచింపచేసిందనే చెప్పాలి. ఇకపోతే సంప్రదాయ ఓటు అన్నదానికి అర్థం లేకుండా పోతోంది. ఓటర్లు కూడా ఎప్పటికప్పుడు మారుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఫలానా పార్టీకే అంటిపెట్టుకుని ఓటర్లు ఉండడం లేదు. మోడీకి ప్రత్యామ్నాయ నేతగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆవిర్భవించినట్లు ప్రచారం జరిగినా..అవినీతి మరకలు అతడిని అథఃపాతాళానికి తొక్కేశాయి. ఢిల్లీలో రెండుసార్లు అధికారం నిలుపుకోవడంతో పాటు పంజాబ్‌లో అధికారం చేపట్టడంతో తనకు తిరులేదని భావించారు. ప్రధాని పదవిపై కన్నేసి అడ్డమైన గడ్డి తిన్నారు. మోడీకి తానే ప్రత్యామ్నాయం అనుకుని కేజ్రీవాల్ విర్రవీగారు. ఈ క్రమంలో నీచరాజకీయాలకు లోనయ్యారు. ఇక యూపిని తీసుకుంటే యోగి పాలనా దక్షతకు తోడు మోడీ డబుల్ ఇంజిన్ ప్రచారం బాగా పనిచేసింది. యూపిలో వరుసగా రెండోసారి అధికారం నిలుపుకోవడం కూడా బిజెపికి ఓ చరిత్రగా చూడాలి. యూపి ఫలితాలను విశ్లేషించుకుంటే ఎస్పీ బలం పుంజుకుంది. తొలిసారి వంద సీట్లను దాటింది. ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. బిఎస్పీతో పాటు కాంగ్రెస్ కూడా యూపిలో పూర్తిగా తుడిచిపెట్టుకుని పోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ రాహుల్,ప్రియాంకల ప్రచారం ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఇందిరతో ప్రియాంకను పోలుస్తూ ఇటీవల దేశంలో పెద్ద ఎత్తున ప్రచారం సాగినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. బిజెపి పట్ల ప్రజలు ఇంకా విశ్వాసంతోనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అవినీతి రహిత పాలన కూడా బాగా పనిచేసిందనే చెప్పాలి. దేశ ప్రయోజనాలను కూడా ప్రజలు ఆశిస్తున్నారు. అలాగే ప్రత్యామ్నాయ రాజకీయాలకు అడుగు పడుతుందా అన్నది కూడా ఇప్పుడు అనుమానంగా మారింది. కాంగ్రెస్ తాను గిరిగీసుకున్న చట్రం నుంచి బయటపడాలి. తనను తాను సంస్కరించుకోవాలి. ప్రజాపోరాటాలతో రాటుదేలాలి. కేవలం ఒక్కటంటే ఒక్క పాదయాత్ర చేసి ఇక అంతా అయ్యిందన్న ధీమాలో రాహుల్ ఉన్నారు. అలా అనుకుంటే పొరపాటు. ప్రజలు కాంగ్రెస్‌కే ఎందుకు ఓటేయాలన్న ఆలోచన కలిగించగలగాలి. గతంలో తెలంగాణ సిఎంగా ఉన్న సమయంలో కెసిఆర్ కూడా గుణాత్మక రాజకీయాలు అంటూ బయలు దేరారు. ఆయనకు మమతా బెనర్జీ, ఉద్ధవ్ థాక్రే, స్టాలిన్ లాంటి నేతలు మద్దతు పలికారు. పికె లాంటి వారు వ్యూహాలు పన్నారు. ఫలితాలు బిజెపికి వ్యతిరేకంగా వస్తాయిన అంతా ఆశించారు. కానీ ఇప్పుడు కెసిఆర్ ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యారు. తెలంగాణలో అధికారం కోల్పోవడంతో ఆయన చురుకైన పాత్ర పోషించడం లేదు. మోడీని నిలువ రించేందుకు ప్రతిపక్షాలను ఐక్యం చేయాలన్న సంకల్పంలో ఇప్పుడు రాజకీయంగా శూన్యం ఏర్పడిందనే చెప్పాలి. ఎందుకంటే మోడీ వ్యూహాల ముందు అంతా దిగదుడుపే అని తేలిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలను కుటుంబం నుంచి తప్పిస్తే తప్ప దానిని ముందుకు తీసుఉకుని వెళ్లడం సాధ్యం కాదు. ఆయా రాష్ట్రాల్లో బిజెపి అధికారం నిలబెట్టు కోవడమన్నది బిజెపికి కలసివచ్చే అంశగా చూడాలి. అలాగే మోడీ, అమిత్ షాల ఉమ్మడి నాయకత్వం పట్ల ప్రజల విశ్వాసం చెదరలేదని, వారికి తిరుగులేదని కూడా చెప్పుకో వచ్చు. ఇదే సందర్భంలో ప్రాంతీయ పార్టీలకు ప్రత్యామ్నాయం కూడా అంత సులభం కాదని కూడా గుర్తించాలి.

# పాక్‌లో రైలు హైజాక్ కేసు

## 30మంది మిలిటెంట్లను హతమార్చిన బలగాలు




**లాహోర్, మార్చి 12 :** పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనలో బలోచ్ వేర్పాటువాదుల చెర నుంచి దాదాపు 190 మంది ప్రయాణికులను భద్రతాబలగాలు రక్షించాయి. అలాగే 30 మంది మిలిటెంట్లను మట్టుపెట్టాయని స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అయితే మిలిటెంట్లు ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ (ఏజౌజీస ఇలూసఃబబ) వెళ్తున్న సమయంలో ఈ హైజాక్ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. అలాగే రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే.. బలోచ్ తిరుగుబాటుదారులు అఎ÷-గానిస్థాన్‌లోని తమ కీలక నేతతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. హైజాక్‌లో మొత్తం 70 నుంచి 80 మంది వేర్పాటువాదులు పాల్గొన్నారంటూ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్‌కు రాకపోకలు సాగించే అన్ని రైళ్లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్న వారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును కూడా ధ్వంసం చేస్తామని చెబుతోంది.

# ముడి ఉక్కు ఉత్పత్తిలో రెండవ పెద్ద దేశంగా భారత్

## కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు




**న్యూఢిల్లీ,మార్చి12:** ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం రెండవ అతిపెద్ద దేశంగా అవతరించడం ఆనందంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన నూతన స్టీల్ సెక్టార్‌లో పరిశోధన, అభివృద్ధి, స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఆర్టీఎంఐ) వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్ ఫారాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ పరిశ్రమ రంగంలో సాధించిన అభివృద్ధి గురించి చర్చించడం ఆనందంగా ఉందన్నారు. నూతన స్టీల్ సెక్టార్‌లో ఎస్‌ఆర్టీఎంఐ వెబ్-పోర్టల్‌లో స్టీల్ కొల్లాబ్ ప్లాట్‌ఫారాంను విజయవంతంగా ప్రారంభించడం ద్వారా ఉక్కు తయారీలో నూతన ఆవిష్కరణలు, స్థిరత్వం, సాంకేతిక పురోగతిని ప్రోత్సహించడానికి ప్రధాన మోడీ నాయకత్వంలో బలమైన పునాదిని వేశామని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. అయితే, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఉక్కు డిమాండ్ తో జీడీపీ వృద్ధిని అధిగమించింది.. ఇది ఆర్థికాభివృద్ధిలో కీలకమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. స్టీల్ రంగ వృద్ధిలో స్థిరత్వాన్ని సాధించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కింద ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు ఈ రంగం అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎస్‌ఆర్టీఎంఐ వెబ్ సైట్ ద్వారా ఆసక్తిగల వాటాదారులను, ఈ రంగం అభివృద్ధికి సహకరించడానికి ఆహ్వానిస్తుండటంతో పాటు నూతనంగా ప్రారంభించిన మూడు ఆర్‌అండ్ డీ పథకాలు స్టీల్ రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని శ్రీనివాస వర్మ చెప్పుకొచ్చారు.

# సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

## ఇద్దరు మహిళ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్, మార్చి 12:** సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వ ప్రసాద్ మీడియాకు వివరించారు. నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో రేవంత్ రెడ్డిని తిడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించామని విశ్వప్రసాద్ అన్నారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో ఓ వ్యక్తిని ఉద్దేశ్యపూర్వకంగా ఇంటర్వ్యూ చేస్తూ రేవంత్ రెడ్డిను అసభ్యకర వ్యాఖ్యలతో దూషించేలా చేశారని పోలీసులు గుర్తించారు. ఆ వీడియో గత నెలలో రికార్డు చేసినా అసెంబ్లీ సమావేశాలకు 2రోజుల ముందు టెలికాస్ట్ చేశారని తెలిపారు. ఈ వీడియోను నిప్పు కోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో వైరల్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇన్సెటివ్స్ తీసుకుని మరీ ట్రోల్ చేస్తున్నట్లు తెలిపారు. సెక్షన్ 67 ఐటీ యాక్ట్, 111బిఎన్ఎస్, 61(2), 353(2), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మాదాపూర్‌లోని టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి 2 ల్యాప్ టాప్‌లు, 2 హార్డ్ డిస్కులు, లోగో, రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేవతిపై గతంలో ఎల్‌బీనగర్, బంజారాహిల్స్‌లో కేసులు ఉన్నాయని వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు.

# త్రిభాషా సూత్రం ముమ్మాటికీ సమ్మతమే

## ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిది.. ఎంపీ సుధామూర్తి స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,మార్చి12 :** జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్న తరుణంలో రాజ్జసభ ఎంసి సుధామూర్తి ఎన్ఇపికి మద్దతు పలికారు. భాషలు నేర్చుకోవడంలో తప్పులేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ, ప్రముఖ వితరణశీలి సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ.. త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు. 'ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీని వల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు' అని సుధామూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్రిభాషా సూత్రం అమలుపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం దీనిపై మాట్లాడుతూ.. 'ద్విభాషా పద్ధతిపై తమిళనాడు చాలా స్పష్టంగా ఉంది. ప్రపంచ శాస్త్ర, సాంకేతికత, వాణిజ్య విధానాలతో అనుసంధానం కోసం ఆంగ్లం నేర్చుకోవాలి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కోసం తమిళం ఉండాలి. ఒకవేళ మూడో భాషను నేర్చుకోవాలంటే అది విద్యార్థుల అభీష్టానికి వదిలేయాలి. అంతేగానీ.. తప్పనిసరి అంటూ బలవంతంగా రుద్దకూడదు. కేంద్రం చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అయితే, ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# కాలం భగవత్ స్వరూపం



తిరుమల, మార్చి 12 :కాలం భగవంతుని స్వరూపం. ఈ సష్టిలో అత్యంత బలమైనది కాలమే. కాలానికి సమస్త జీవరాశీ వశపడవలసిందే. కాలానికి లొంగకుండా బతకగలిగినది ఈ సష్టిలో ఏదీ లేదు. అందుకే శ్రీ రామాయణంలో కాలం గురించి చెబుతూ...'కాలోహి దురతి క్రమః' అంటారు వాల్మీకి మహర్షి. అంటే ..కాలాన్ని దాటడం, తనకు వశం చేసుకోవడం, దాన్ని కదలకుండా చేయగలగడం... లోకంలోఎవరికీ సాధ్య పడదని. సాధారణ సిద్దాంతంలో అందరూ కాలానికి వశపడవలసిందే. కాలంలో పుడతారు, కాలంలో పెరుగుతారు, కాలంలోనే శరీరాన్ని విడిచి పెడతారు. అందరూ కాలానికి వశపడి ఉంటారు. కానీ ఎవడు భగవంతుడిచ్చిన జీవితం అనబడే ఈ శరీరంతో ఉండగలిగిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడు తన శరీరాన్ని విడిచి పెట్టేసిన తరువాత కూడా కీర్తి శరీరుడిగా నిలబడిపోతాడు. ఆయనకి కీర్తే శరీరం అవుతుంది. ఆయన కాలంతో సంబంధం లేకుండా యుగాలు దాటిపోయినా కూడా కొన్ని కోట్ల మందికి ప్రేరణగా అలా నిలబడిపోతాడు. అందుకే మనుష్యుని జీవితంలో అన్నిటికన్నా అత్యంత ప్రధానమైనదిగా చెప్పబడేది కాలం విలువను గుర్తించడం. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఎవడు కాలం విలువని గుర్తించలేడో ఎవడు కాలాన్ని సద్వినియోగం చేసుకోలేదో వాడు కాలగర్భంలో కలిసిపోతాడు. ఆ జీవితం ఏ విధంగా కూడా ఉపయోగకరం కాదు. తనను తాను ఉద్ధరించుకోవడానికిగానీ, మరొకరిని ఉద్ధరించడానికిగానీ పనికిరాడు.

# ఇటుక బట్టి కార్మికుల పిల్లలకు ప్రత్యేక బోధన

## యూనిఫామ్‌తో పాటు బ్యాగు, షూ అందజేస్తాం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్,జనతా న్యూస్:** వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రత్యేక బోధన అందిస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటుక బట్టి కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలను జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఇక్కడ చదువుతున్న సుమారు 50 మంది కార్మికుల పిల్లలతో ఒడియా, హిందీలో భాషల్లో మాట్లాడారు. వారికి ఇస్తున్న ఆహారం, బోధన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల పిల్లల కోసం యూనిఫామ్, షూ సాక్సులు, బ్యాగు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు పలు రాష్ట్రాల్లో సంచరించే అవకాశం ఉందని, అందువల్ల వారికి ఇంగ్లీషులో బోధించాలని, సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేయించాలని, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి సరైన చికిత్స, అనుబంధ ఆహారం అందించాలని ఆదేశించారు. డెంటల్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయించాలని తెలిపారు. పరిశుభ్రతను, నాణ్యతను గురించి వారికి అవగాహన కల్పించాలని అన్నారు.



**ఆరవ తరగతి విద్యార్థులకు బోధించిన కలెక్టర్**

గట్టుపుత్కూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఇక్కడి ఆరవ తరగతి పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. ఉన్నత రంగాల్లో రాణించేందుకు ఇంగ్లీష్ ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.


# ఉద్యోగ ప్రకటనలు నిలుపుదల కోసం నిరసన దీక్షలు



జనత న్యూస్ బెజ్జంకి : ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ, మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పర్శ రాములు ఆధ్వర్యంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన దీక్షలకు చేపట్టారు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగా నియామకాలు చేపట్టడం ద్వారా తమ సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ మూడు గ్రూపులుగా కాకుండా, నాలుగు గ్రూపులు గా చేపట్టాలని తదితర డిమాండ్లతో నిరసన దీక్షలు చేస్తున్నట్లు , తమ డిమాండ్లు నెరవేరి తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి చింతకింది పరుశరాములు, మంకాల బాలయ్య, కర్రావుల మల్లేశం, మోదుంపల్లి రాజు, బోనగిరి చంద్రయ్య, సత్తయ్య,కొమ్ము కోటి తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాల ఆవిష్కరణకు చొరవ తీసుకోవాలి....

### తెలంగాణ ఉద్యమ నాయకులు ఎడ్ల జోగి రెడ్డి




తిమ్మాపూర్, జనతా న్యూస్ తిమ్మాపూర్ మండల కేంద్రంలో గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహా లకున్నటువంటి ముసుగులను వెంటనే తొలగించి ఆవిష్కరణ చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకో వాలని తెలంగాణ ఉద్యమ నాయకులు, బిజెపి సీనియర్ నాయకులు ఎడ్ల జోగి రెడ్డి అన్నారు. అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహాల ముసుగు లను తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అన్నీ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘా లతో ఏర్పడిన జేఏసి ఆధ్వర్యంలో తిమ్మాపూర్ తాసిల్దార్ కార్యాలయ సమీపంలో 3వ రోజు బుధవారం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఎడ్ల జోగి రెడ్డి సందర్శించి సంఘీభావాన్ని తెలిపి మద్దతు ప్రకటిం చారు. ఈ సందర్భంగా ఎడ్ల జోగిరెడ్డి మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో సరైన అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటుకు సిద్ధం చేయగా ఒక ఉన్నతాధికారి అడ్డుకోవడం వల్లే సమస్య తలెత్తిందని అన్నారు. రెండేళ్లు అయినా కూడా ఈ సమస్యకు పరిష్కారం లభించకపోవడం ఆ మహనీయులను అవమానపరిచినట్లే అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటై ఏడాది పూ-ర్తయిన కూడా మహ నీయుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతి లభించక ఆవిష్కరణకు నోచుకోకపోవడం సిగ్గుచేటు, బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మహనీయుల విగ్రహాల ఆవిష్క రణకు అనుమతులు ఇచ్చి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. లేనియెడల విగ్రహాలు ఆవిష్కరణ చేసేంతవరకు జేఏసీ పక్షాన పోరాటాలు ఆగవు అని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఎడ్ల జోగిరెడ్డి, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి, మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, ల్యాగల వీరారెడ్డి, ఎలుక ఆంజనేయులు, చల్ల రవిందర్ వడ్లూరి శంకర్,బొజ్జ తిరుపతి ప్రణీత్ రెడ్డి, ల్యాగల దేవేందర్, బుర్ర అంజయ్య గౌడ్, గంగరాజం, పర్శరాములు, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాతంగి శంకర్, వంతడుపుల సంపత్, అంబాల సతీష్,కనకం రాములు, సముద్రాల లక్ష్మన్, పారునంది జలపతి,కొయడ మురళి, కామెర వెంక టేష్, దుర్గం అశోక్,గాజ సాగర్, ఉప్పులేటి రాజు, మాతంగి రాజమల్లు కొమ్ము సంపత్, మేకల సునీల్, తాటిపెల్లి జంపన్న,సముద్రాల మల్లేశం, బొర్రా అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు భూమాతకు శ్వాస అవయవాలు




కరీంనగర్,జనతా న్యూస్: మొక్కలే మనుషుల్ని రక్షిస్తాయి అని అవే భూమాతకు శ్వాస అవయవాలని స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమా రిసోర్స్ పర్సన్స్ మాడిశెట్టి గోపాల్, కె ఎస్ అనంతా చార్య అన్నారు.బుదవారం జిల్లా పరిషత్ హై స్కూలు కొత్తపల్లి, జిల్లా పరిషత్ హైస్కూలు రామడుగు మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ రుద్రారం పాఠశాలలలో స్కిల్ డెవలప్మెంట్ లో భాగంగా ఈ రోజు శిక్షణా బృందం ఆయా పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీ వర్మి కంపోస్ట్ తయారీ గురించి తెల్పి తయారీ విధానాలు వారు తెలియ జేసారు. రిసోర్స్ పర్సన్ గా మాడిశెట్టీ గోపాల్,కె ఎస్ అనంతాచార్య వ్యవహరించారు. కార్యక్రమం లో ఉపాద్యాయులు ఉపాధ్యాయులు పుష్పలీల, పద్మజ రంగనాథ శర్మ, శ్రీనివాస్ మరియు 8,9 తరగతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కాయిత రాములు, కామని రవీందర్

### ఉత్కంఠ భరితంగా జరిగిన హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు





(కోరెం సుధాకర్ రెడ్డి, జనతా న్యూస్ ప్రతినిధి హుజురాబాద్): టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు బుధవారం జరిగాయి. గతంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఉన్న అల్లి నరేందర్ తన పదవికి రాజీనామా చేయడంతో.. సీనియర్ జర్నలిస్ట్ గడ్డం ధర్మారెడ్డిని అడ్ హాక్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఇటీవల ధర్మారెడ్డి కూడా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలని కరీంనగర్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని స్థానిక లోని మధువని గార్డెన్లో ఎన్నుకున్నారు. మొదట ఏకగ్రీవ ఎన్నికకు ప్రయత్నించినప్పటికీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పదవులకు ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కాయిత రాములు (దిశ), ప్రధాన కార్యదర్శిగా కామని రవీందర్ (సాక్షి) గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షులుగా ముష్క శ్రీనివాస్ (సూర్య), పిల్లల సతీష్ కుమార్ (ఆంధ్రజ్యోతి), మాడ రవీందర్ రెడ్డి (హెచ్ఎంటీవీ) లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిలుగా కుడిక్యాల సాయిలు, మచ్చిక చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోస్కుల రాజ్ కుమార్, కోశాధికారిగా కేశబోయిన స్వామి, కార్యవర్గ సభ్యులుగా హర్షిల్ అజీమ్, నాగవల్లి రాజు, మంతెన కిరణ్ కుమార్, భారత రజినీకాంత్, అబ్దుల్ ఫహీం, బత్తుల రాజలింగం, పోతురాజు సంపత్, చిర్ర సుదర్శన్, తాటిపాముల దేవేందర్, మర్రి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ లు మాట్లాడుతూ.. తమకు ఓటు వేసి గెలిపించిన తోటి పాత్రికేయ మిత్రులకి అభినందనలు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యలతో పాటు ప్రధాన సమస్య అయిన జర్నలిస్టుల నివేషణ స్థలాలపై ఎలాంటి పోరాటాల కైనా సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్,స్టేట్ హెల్త్ కమిటీ మెంబెర్ మహేంద్రాచారి తోపాటు జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రెస్ క్లబ్ కొత్త కమిటీకి అభినందనల వెల్లువ**

హుజురాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త కార్యవర్గాన్ని సీనియర్ పాత్రికేయులు కోరెం సుధాకర్ రెడ్డి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య, తిరునగరి ఆంజనేయస్వామి, సాక్షి వరంగల్ బ్యూరో ఇంచార్జ్ గడ్డం రాజిరెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, మామిడి రవీందర్, అలుమల్ల సాంబశివరెడ్డి, న్యాయవాది ముక్కెర రాజు, కే సి రెడ్డి నరసింహారెడ్డి, అల్లి నరేందర్, పరాన్కుశం కిరణ్ కుమార్ తదితరులు అభినందించారు. అలాగే పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు ప్రెస్ క్లబ్ కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. కొత్త కమిటీకి తమ సహకారం ఉంటుందని, జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని కోరారు.

**ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు**

హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా ఇక్కడికి వచ్చి సభ్యులతో చర్చించి ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ద్వారా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ప్రజా క్రాంతి శ్రీనివాస్, ప్రతినిధులు చంద్రశేఖర్, ఎనగందుల రవీందర్, మహేంద్ర చారి లకు హుజురాబాద్ ప్రెస్ క్లబ్ కొత్త అధ్యక్షులు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామని రవీందర్, సీనియర్ పాత్రికేయులు కోరం సుధాకర్ రెడ్డి, తిరునగరి ఆంజనేయస్వామి, మామిడి రవీందర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ హుజురాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్నికలకు సహకరించిన సభ్యులకు పేరుపేరునా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# హుజురాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీలో.. ఈనెల 13 నుండి 31 వరకు ఈకేవైసి మేళా

### అంబుజా గ్యాస్ అధినేత పివి మదన్మోహన్

హుజూరాబాద్ మార్చి 12 జనతా న్యూస్: హుజురాబాద్, జమ్మికుంట పాత తాలుకాల పరిధిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ఐఓసియల్ (ఇండేన్) గ్యాస్ అంబుజా గ్యాస్ ద్వారా సిలిండర్లు పొందుతున్న వాడకం దారులకు ప్రభుత్వం ద్వారా అందించే గ్యాస్ రాయితీ పొందేందుకు ఈకేవైసి మేళా కార్యక్రమాన్ని 13వ తేది గురువారం నుండి మార్చి 31వ తేదీవరకు హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజన్సీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్యాస్ ఏజన్సీ అధినేత, తెలంగాణ యల్పీజి డీలర్ల అధికార ప్రతినిధి పి.వి.మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లు తమ ఆధార్, గ్యాస్ పేపర్ జిరాక్స్ ప్రతులను తీసుకొని రావాలని ఈకేవైసి నమోదు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొనబడిన తేదీల్లో ఉదయం ఎనమిది గంటల నుండి ఒంటి గంటవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వివరించారు. కస్టమర్ నేరుగా ఈకేవైసి చేసుకునేవారు %×అ-ఽఋఅశీఅశ్రీ.ఎశీ.ఱఅ% సైట్ సందర్శించి %ఎఎశ్రీజూస్త్ర.ఱఅ% ద్వారా ఈకేవైసి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దైనందిన జీవితంలో బాంకింగ్ ఇతర కార్యక్రమాలకు ఈకేవైసి ఎంత ముఖ్యమో యల్పీజి వాడకంలో కూడా అంతే ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. సురక్ష రబ్బరు ట్యూబులు వాడుతున్న వినియోగదారులు విధిగా ట్యూబులు మార్చుకోవాలని, వాటి కాలపరిమితి ఐదు సంవత్సరాలని పీవీ మదన్మోహన్ తెలిపారు. సురక్ష రబ్బరు ట్యూబుపై తయారీ తేది కాలపరిమితి తేది ముద్రించబడి ఉంటుందని తెలిపారు. కాలం చెల్లిన నాణ్యత ప్రమాణాలు లేని రబ్బరు ట్యూబులు జరిగే ప్రమాదాలకు ఇన్స్యూరెన్స్ వర్తించదని తెలిపారు. అదేవిధంగా గ్యాస్ లీకేజి వల్ల మంటలు చెలరేగినప్పుడు నియంత్రించేందుకు ఫైర్ బాల్స్ ఐఓసియల్ అందుబాటులోకి తెచ్చిందని ఇరవైనాలుగు వందల విలువ గల ఈ పరికరాన్ని వేయి రూపాయలకు అందిస్తున్నామని మదన్ మోహన్ తెలిపారు. ఐదు సంవత్సరాల వారంటి భీమా సౌకర్యం ఉందని ఆయన వెల్లడించారు.

# రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్




జనత న్యూస్, హుస్నాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్ డిమాండ్ చేశారు.బుధవారం హుస్నాబాద్ శాఖలో జరిగిన ఏబీవీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకలజనులు పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో మొదటి పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసారన్నారు. నిధులు కేటాయించకుండా విద్యావ్యవస్థను గత ప్రభుత్వం అధోపాతాలానికి తొక్కితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే దారిలో వెళ్తున్నదన్నారు రేవంత్ రెడ్డి మాటలు నమ్మి విద్యార్థులు, నిరుద్యోగులు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కోటి ఆశలతో రేవంత్ రెడ్డి సర్కార్ ను ఏర్పాటు చేసుకున్నారని... కానీ తీరా అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సీఎం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్ షిప్ రియంబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయక పోవడంతో పేద , బడుగు బలహీన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో గత ప్రభుత్వం దాదాపు రూ. 7500 కోట్ల బకాయిలు విడుదల చేయక అనేకమంది విద్యార్థులు అరిగోస పడ్డారన్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే కాకుండా విద్యా రంగానికి కేవలం 6 నుండి 7శాతం వరకు నిధులు కేటాయించడంలోనే విద్యారంగం మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర నిధులను విద్యారంగానికి కేటాయించి ఉద్దేశపూర్వకంగా విద్యాను నిర్వీర్యం చేస్తున్న వైఖరిని మార్చుకొని ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి, పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా అడుగులు వేయాలన్నారు. లేనియెడల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు రాజేష్, రాజు నగర సంయుక్త కార్యదర్శులు రాహుల్, చరణ్, జూనియర్ కళాశాల కార్యదర్శి అంజి, నగర ఎస్ఎఫ్డీ కన్వీనర్ సంతోష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ప్రైవేటు అప్పులు తీర్చేందుకు ఇక బ్యాంకు రుణాలు

### బ్యాంకర్లు,వ్యవసాయ అధికారులతో న్యాయ సేవాధికారులు సమావేశం వినియోగించుకోవాలని కోరిన పాకాల శ్రీహరి రావు




**కరీంనగర్,జనతా న్యూస్:** పంట రుణాలకు అదనంగా తమ ప్రైవేటు అప్పులను తీర్చుకోవడానికి తక్షణం లక్ష రూపాయల మేరకు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు కోరారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ ప్రైవేటు అప్పులు తీర్చుకునేందుకు బ్యాంకుల నుండి రుణం పొందే అవకాశం ఉన్నందున దానికోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆ ఊబి నుండి బయటకు తెచ్చే ఉద్దేశంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన మార్గదర్శకాల

అమలుకు ఎట్టకేలకు ముందడుగు పడిందన్నారు ఉన్నత న్యాయస్థానం డబ్ల్యూపి(పిల్) 269/2018 ప్రకారం బ్యాంకుల నుంచి రైతులు తమ ప్రైవేటు అప్పులను తీర్చేందుకు రుణాలు పొంద వచ్చుని ఆదేశాలు జారీ చేసిందని అయన అన్నారు.

ఈ ఆదేశాల అమలుకు గాను సంబంధిత బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, అర్హులైన రైతులందరికి " ప్రైవేట్ అప్పులు తీర్చుకోడానికి రుణాలు మంజూరు అయ్యే విధంగా చూడాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల న్యాయ సేవా సంస్థల చైర్ పర్సన్లకు,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గత నెల 27న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి బి ప్రతిమ, కార్యదర్శి కే వెంకటేష్,తెలంగాణ రైతు రక్షక సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు, సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.



## డంకీ రూట్‌లో అమెరికాకు పయనం

### ఇద్దరు భారతీయులు కిడ్నాప్

**న్యూఢిల్లీ :** అమెరికాలో అక్రమంగా ఉంటున్నవారిని అక్కడి ప్రభుత్వం వెనక్కి పంపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్ర దేశానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలో డంకీ మార్గంలో అమెరికాకు వెళ్తున్న ఇద్దరు భారతీయులు గ్వాటెమాలాలో కిడ్నాప్‌కు గురయినట్లు తెలుస్తోంది. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈమేరకు బాధిత కుటుంబాలు వాపోయినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. కిడ్నాప్‌కు గురైన వారిలో హరియాణాకు చెందిన యువరాజ్ సింగ్ ఒకరు. ఆయన తండ్రి కుల్దీప్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'నా కుమారుడు అమెరికాకు వెళ్లాలనే ఉద్దేశంతో ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. చట్టపరంగా అక్కడికి వెళ్లేందుకు రూ.41 లక్షలకు డీల్ కుదిరింది. తొలుత రూ.2 లక్షలు చెల్లించగా.. మిగిలినవి ఆ దేశానికి వెళ్లాక చెల్లించాలనేది ఒప్పందం. అయితే, మధ్యలోనే మరో రూ.14 లక్షలు తీసుకున్నారు. అయితే, అమెరికాకు బయలుదేరిన తర్వాత యువరాజ్ నుంచి ఫోన్ కాల్స్ రాలేదు. ఫోన్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల నుంచి వెళ్తున్నారని, ఆ దేశం చేరుకున్నాక మాట్లాడవచ్చని ఏజెంట్లు భరోసా ఇచ్చారు. అయితే, గతేడాది డిసెంబరులో కిడ్నాపర్ల నుంచి మాకు ఒక వీడియో వచ్చింది. అందులో కొందరు వ్యక్తులు యువరాజ్‌ను చిత్రహింసలు చేస్తూ గన్ చూపించి బెదిరించారు. అతన్ని విడిచిపెట్టాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు' అని కుల్దీప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. కిడ్నాప్‌కు గురైన మరో వ్యక్తి పంజాబ్‌లోని హూషియాపూర్ జిల్లాకు చెందినవారు. వారిని విడిచిపెట్టేందుకు 20 వేల డాలర్లు డిమాండ్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ట్రావెల్ ఏజెంట్లపై స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక, తమ కుమారులను భారత ప్రభుత్వం రక్షించాలని బాధిత కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల అనేకమంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే.


### స్విట్జర్లాండ్ వెళ్తున్నానని బంగారం కొని..

## భారత్‌లో ల్యాండ్ అయిన రన్యారావు



**బెంగళూరు :** దుబాయ్ నుంచి విమానంలో అక్రమంగా బెంగళూరుకు బంగారాన్ని తెస్తూ దొరికిపోయిన నటి రన్యారావు కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది చివర్లో రెండుసార్లు దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేసిన ఆమె.. దానిని తీసుకొని తాను స్విట్జర్లాండ్ వెళ్తున్నానని అక్కడి కస్టమ్స్ అధికారులకు వెల్లడించారు. కానీ ఆమె ప్రయాణ వివరాలను పరిశీలిస్తే, ఆమె భారత్‌కు వచ్చినట్లు వెల్లడైందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తన అరెస్ట్ మెమోలో పేర్కొంది. విమానాశ్రయంలో గ్రీన్ ఛానల్ ద్వారా వెళ్తున్నప్పుడు తన దగ్గర సుంకాలు విధించే వస్తువులు ఏవీ లేవని నటి చెప్పారు. కానీ మెటల్ డిటెక్టర్ వద్ద మాత్రం ఆమె దొరికిపోయారు. ఆ వెంటనే కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు ఆమెను ఆపి, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన కాగితాలను ఆమె చూపించలేకపోయిన సంగతి తెలిసిందే. నడుము చుట్టూ, కాళ్ల కిందిభాగం, షూలో ఆ బంగారాన్ని దాచారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్‌లో వెళ్లే ప్రయాణికులు కస్టమ్స్ క్లియరెన్స్ అవసరం లేని వస్తువులు తీసుకెళ్తుంటారు. అదే రెడ్ ఛానల్‌లో వస్తువులను కస్టమ్స్ అధికారులు చెక్ చేసి, సుంకాలు చెల్లించిన తర్వాతే వాటిని బయటకు వదులుతారు. ఇక బంగారం స్మగ్లింగ్ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. స్మగ్లింగ్‌లో ఆమెతో సంబంధమున్న వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె వివాహానికి సంబంధించిన వీడియోలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రన్యారావు నివాసం, ఆమెకు సంబంధించిన ప్రాంతాలు, నటి వివాహం చేసుకున్న హోటల్‌కు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. ఈ వేడుకకు హాజరైనవారు, అతిథులు తీసుకొచ్చిన ఖరీదైన కానుకలపై దృష్టిసారిస్తున్నారు. అందుకోసం పెళ్లికి సంబంధించిన వీడియోను పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్మగ్లింగ్ చేసే సమయంలో ఎయిర్‌పోర్టులో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై విచారణ జరపాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ట్రంప్ కోతల ఎఫెక్ట్.. ఈసారి విద్యాశాఖపై



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై దృష్టిపెట్టారు. అందులోభాగంగా పలు కీలక విభాగాల్లో కోతలు ప్రకటించారు. ఈ క్రమంలో విద్యాశాఖలోని సిబ్బందిని సగానికి తొలగించే ప్రయత్నాల్లో ఉన్నామని ప్రభుత్వం తెలిపింది. దీనిలోభాగంగా విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్‌మాన్ బాధ్యతలు స్వీకరించిన ఐదు రోజుల్లోనే సిబ్బంది తొలగింపునకు సిద్ధమయ్యారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. "ట్రంప్ నాకు ఇచ్చిన ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. విద్యాశాఖను మూసివేసేందుకు మేం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలుసు. కానీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అవసరానికి మించి ఉన్నవారిపై కత్తెర వేయడం కిందికే వస్తుంది" అని లిండా పేర్కొన్నారు. అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. విద్యాశాఖను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4100 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడానికి ముందుకొచ్చారు. ఇదిలాఉంటే.. కాలేజీలు, స్కూళ్లు, యూనివర్సిటీలకు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి నిధులు నిలిపివేస్తామని స్పష్టంచేశారు. "చట్టవిరుద్ధ నిరసనలను అనుమతించే కాలేజీ, స్కూల్ లేదా యూనివర్సిటీలకు అన్ని ఫెడరల్ నిధులు నిలిపివేస్తా. ఆందోళనకారులను జైలుకు లేదా వారి స్వదేశానికి పంపించడం జరుగుతుంది. అమెరికా విద్యార్థులైతే శాశ్వత బహిష్కరణ లేదా కేసు తీవ్రతను బట్టి అరెస్టు ఉంటుంది. ఇందులో ఎటువంటి దాపరికం లేదు. ఈ విషయంపై దృష్టిపెట్టినందుకు ధన్యవాదాలు" అని హెచ్చరించారు.

### తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాలకు

## తమిళం తప్పనిసరి

### మద్రాస్ హైకోర్టు



**చెన్నై :** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా సూత్రం అమలును రాష్ట్రంలోని రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో తమిళ భాషలో నిర్వహించిన పరీక్షలో విఫలమైనందుకు తనను తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగం నుంచి తొలగించిందని ఆరోపిస్తూ ఎం.జయకుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. తన తండ్రి నావికాదళంలో పని చేస్తుండడం వల్ల తాను సీబీఎస్ఈ పాఠశాలల్లో చదివానని.. అందువల్ల తమిళం నేర్చుకోవడానికి వీలుపడలేదని పేర్కొన్నాడు. కాగా న్యాయస్థానం అతడి పిటిషన్‌ను తోసిపుచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అభ్యర్థులు తప్పనిసరిగా తమిళం రాయడం, చదవడం నేర్చుకోవాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాలకు తమిళం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులకు మాతృభాష అయిన తమిళం తెలియకపోతే రోజూవారీ పనులను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించింది. ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర భాష వచ్చి ఉండాలని లేకపోతే వారు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించలేరని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తంచేసింది. ఈ కేసును ఆరు నెలలపాటు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో భాషా యుద్ధం తీవ్రమవుతున్న సమయంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. తమిళభాషకు, రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ పేర్కొన్నారు. దీనిపై గత కొన్ని రోజులుగా కేంద్రం, తమిళనాడు రాష్ట్రానికి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

## టార్గెట్ జాఫర్ ఎక్స్‌ప్రెస్

### ఏళ్ల నుంచి మిలిటెంట్ల లక్ష్యం..



**బొలాన్ :** పాకిస్థాన్‌లో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచిఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) గ్రూప్ ఈ రైలును లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైల్లో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. దీంతో మిలిటెంట్ గ్రూప్‌లకు ఇది హాట్ టార్గెట్‌గా మారింది. 2018, 2023లో పలుమార్లు దీనిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. 2018లో పంజాబ్ వెళుతున్న రైలుకు అత్యంత సమీపంలో రెండు బాంబులు పేలాయి. బలోచ్ రెబల్స్ రిమోట్ కంట్రోల్ సాయంతో ఈ దాడికి పాల్పడ్డారు. నాడు ప్రమాదం నుంచి ఇది బయటపడింది. 2023 జనవరి 19న రైల్లో బాంబుపేలి 13 మంది గాయపడ్డారు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని బొలాన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నెల రోజుల తర్వాత అదే రైలు క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతుండగా బాంబుపేలుడు జరిగింది. దీనిలో ఒకరు మరణించారు. ఇక గతేడాది క్వెట్టా రైల్వే స్టేషన్‌లో పేలుడు జరిగి 26మంది ప్రాణాలు కోల్పోయారు.

### 155 మంది బందీలను విడిపించిన భద్రతా దళాలు..

తాజాగా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి 155 మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి. ఈ క్రమంలో 27 మంది వేర్పాటువాదులను మట్టుబెట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. రైల్లోని తొమ్మిది బోగీల్లో 400 మంది ప్రయాణికులున్నారు. ఈ రైలు క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకొంది. రైల్లో ఉన్న బలోచ్ మిలిటెంట్లు చిన్న బృందాలుగా విడిపోయి ఉండటంతో.. ఆపరేషన్ కష్టతరంగా మారినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి.

### ఐడీ కార్డులు చెక్‌చేసి మరీ..

జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రాణాలతో బయటపడిన బందీలు తమ భయానక అనుభవాలను పంచుకొన్నారు. తొలుత భారీ పేలుళ్లు వినిపించాయని.. ఆ తర్వాత కొంతసేపు కాల్పులు జరిగాయని అల్లాదిత్తా అనే ప్రయాణికుడు చెప్పాడు. దీంతో ప్రయాణికులు ప్రాణాలు కాపాడుకొనేందుకు సీట్ల కింద తల దాచుకొన్నారన్నారు. మిలిటెంట్లు మహిళలు, పురుషులను వేర్వేరుగా ఉంచారు. తాను హృద్రోగినని అని చెప్పడంతో తన కుటుంబాన్ని వదిలేశారని అతడు పేర్కొన్నాడు. ఇక రైల్లోకి మిలిటెంట్లు ప్రవేశించిన వెంటనే ప్రయాణికుల ఐడీ కార్డులను చెక్ చేశారు. సైన్యం, భద్రతా దళాల్లో పనిచేసే వారిని గుర్తించి వేరు చేశారు. ఇద్దరిని తమ ముందే కాల్చేశారని ఓ ప్రయాణికుడు వెల్లడించాడు. మరో నలుగురిని తీసుకెళ్లారన్నారు. వీరితోపాటు పంజాబ్ ప్రాంతం వారిని కూడా బందీలుగా పట్టుకొన్నట్లు వెల్లడించాడు. సైన్యం కిడ్నాప్ చేసిన రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులు, అదృశ్యమైన వ్యక్తులను 48 గంటల్లోగా విడిచిపెట్టాలని బలోచ్ లిబరేషన్ ఆర్మీ డిమాండ్ చేస్తోంది. లేకపోతే తమ బందీలుగా ఉన్న వారిని చంపేస్తామని బెదిరిస్తోంది. అంతేకాదు.. రైలును కూడా ధ్వంసం చేస్తామని చెబుతోంది.

## మా నుంచి మారిషస్‌కు గిఫ్ట్ ఇదే

### ప్రధాని మోదీ



**పోర్ట్ లూయిః:** మారిషస్ తమకు కీలక భాగస్వామి అని భారత ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అలాగే 140 కోట్ల మంది భారతీయుల తరఫున మారిషస్ ప్రజలకు నేషనల్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. "నేషనల్ డే రోజున మరోసారి మీముందు ఉండటం నా అదృష్టం. మన రెండు దేశాలను అనుసంధానించేది హిందూ మహాసముద్రం మాత్రమే కాదు. సంస్కృతి, సంప్రదాయాలు మనల్ని కలిపి ఉంచుతున్నాయి. ఈ రెండు దేశాల బంధాన్ని 'మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య' హోదాకు తీసుకెళ్లాలని ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, నేను నిర్ణయించాం. మారిషస్‌లో కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరించనుంది. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక కానుకగా భావిస్తున్నాం" అని మోదీ అన్నారు. "పది సంవత్సరాల క్రితం 'సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్'కు మారిషస్ నుంచే పునాది వేశాం. ఈ ప్రాంత శ్రేయస్సు, స్థిరత్వం కోసం సాగర్ విజన్‌తో ముందుకొచ్చాం. గ్లోబల్ సౌత్ దేశాల కోసం మహాసాగర్ విజన్‌ను ప్రకటిస్తున్నాం. వాణిజ్యం, పరస్పర భద్రత అంశాలపై దానికింద పనిచేస్తాం" అని మోదీ వెల్లడించారు. ఈ ప్రాంతంలో చైనా తన ప్రభావాన్ని విస్తరించేందుకు చేస్తోన్న ప్రయత్నాల నేపథ్యంలో ఈ మహాసాగర్ ప్రకటన వచ్చింది. నవీన్‌చంద్ర రామ్‌గులాం మాట్లాడుతూ.. "నేషనల్ డే వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ మా దేశంలో పర్యటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. ఆయన రాక రెండు దేశాల బంధానికి నిదర్శనం" అని అన్నారు. ఇద్దరు ప్రధానుల భేటీ అనంతరం ఈమేరకు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశం అనంతరం పోర్ట్ లూయిలోని చాంప్ డి మార్స్ వద్ద మారిషస్ నేషనల్ డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా మోదీ పాల్గొన్నారు. ఆ వేడుకలు వీక్షించేందుకు అక్కడికి వచ్చిన పలువురు ప్రజలు జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ ఈవెంట్‌లో ఐఎన్ఎస్ ఇంఫాల్, నౌకాదళానికి చెందిన హెలికాప్టర్, నౌకాదళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## రన్యారావును నిద్ర పోనివ్వడం లేదు

### కోర్టులో న్యాయవాది వాదనలు

**బెంగళూరు:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు అధికారుల కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె బెయిల్ కోసం ప్రత్యేక కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే నటి తరఫు న్యాయవాది కీలక విషయాలను కోర్టుకు వెల్లడించారు. విచారణ పేరుతో డీఆర్ఐ అధికారులు ఆమెను నిద్ర పోనివ్వడం లేదని న్యాయవాది తెలిపారు. అరెస్టయిన సమయంలో తనకు ఉన్న హక్కుల గురించి ఆమెకు పూర్తిగా తెలియదని కోర్టులో వాదించారు. విమానాశ్రయం వద్ద రన్యారావును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకునే సమయంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని పేర్కొన్నారు. అధికారులకు ఆమె ఇచ్చిన వాగ్మూలం తను స్వతహాగా ఇచ్చింది కాదని వాదించారు. విచారణ పేరుతో ఆమెను సరిగా నిద్ర పోనివ్వడం లేదని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తన క్లయింట్‌కు బెయిల్ మంజూరుచేయాల్సిందిగా కోర్టును కోరారు.

### అమెరికా వస్తువులపై

## ఐరోపా ప్రతీకార సుంకాలు



**ఐరోపా :** అమెరికా టారిఫ్‌లకు ఐరోపా సమాఖ్య తీవ్రంగా తీవ్రంగా స్పందించింది. వాషింగ్టన్‌కు చెందిన 28.33 బిలియన్ డాలర్ల వస్తువులపై తాము ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ఐరోపా కమిషన్ ప్రకటించింది. స్టీల్, అల్యూమినియమ్‌పై విధించిన సుంకాలకు ప్రతిగా ఈ నిర్ణయం తీసుకొంది. ఇప్పటివరకు అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్‌ల సస్పెన్షన్‌ను ఏప్రిల్ 1 నుంచి తొలగిస్తున్నట్లు ఈయూ కమిషన్ వెల్లడించింది. దీంతోపాటు అమెరికా వస్తువులపై మరిన్ని చర్యలు తీసుకొంటామని చెప్పింది. ఈ చర్యలు అమెరికా నిర్ణయానికి సరిపోతాయని వెల్లడించింది. "మా ప్రతిఘటన చర్యలు రెండు దశల్లో అమలవుతాయి. ఏప్రిల్ 1వ తేదీన మొదలై.. 13వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి. అర్థవంతమైన చర్చలకు సిద్ధమే. దీనికి సంబంధించిన బాధ్యతలను ట్రేడ్ కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్‌కు అప్పగించాను. వారు అమెరికాతో చర్చలు జరిపి మెరుగైన పరిష్కారం కనుగొంటారు" అని ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ వెల్లడించారు. సుంకాలు వ్యాపారానికి, వినియోగదారులకు చాలా నష్టదాయకమని ఆమె అభిప్రాయపడ్డారు. అమెరికా, ఐరోపాలో ధరలు పెరిగిపోతాయన్నారు. వినియోగదారులు, వ్యాపారులను రక్షించేందుకు ఈయూ కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. మరోవైపు యూకే కూడా అమెరికా చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని ఎదురుచూస్తోంది. ఆ దేశ వాణిజ్య మంత్రి జోనాథన్ రేనోల్డ్స్ స్పందిస్తూ.. తమ ఎదుట ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇక ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ అమెరికా నిర్ణయంపై స్పందిస్తూ నిరాశ వ్యక్తంచేశారు. ఇది పూర్తిగా అహేతుకమని వ్యాఖ్యానించారు. తాము మాత్రం ప్రతీకార సుంకాలు విధించమని వెల్లడించారు. అదే సమయంలో అమెరికా నుంచి మినహాయింపులు పొందేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ఫిబ్రవరిలో ట్రంప్ ప్రకటించారు. అవి నేటినుంచి అమల్లోకి వచ్చాయి. ఈ చర్యలను ది అమెరికన్ ఐరన్ అండ్ స్టీల్ ఇన్‌స్టిట్యూట్ స్వాగతించింది. దేశీయంగా సరికొత్త ఉద్యోగాలు పుడతాయని పేర్కొంది.

### కెనడాపై డబుల్ సుంకాల విషయంలో

## ట్రంప్ రివర్స్ గేర్



అమెరికా, కెనడాల మధ్య పరస్పర సుంకాల యుద్ధం కొనసాగుతోంది. అమెరికాకు సరఫరా చేసే విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలు చేస్తామని ఆంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ పేర్కొనడంతో.. కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిన్న ప్రకటించారు. తాజాగా ఈ పెంపును ఆయన తాత్కాలికంగా నిలిపివేశారు. అమెరికాలోని పలు రాష్ట్రాలపై విద్యుత్ ధరల పెంపును కెనడా ఉపసంహరించుకున్న నేపథ్యంలో సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాపై 25 శాతం టారిఫ్ విధించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25శాతం పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రకటించింది. దానికి ప్రతీకారంగా కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు తాజాగా ప్రకటించారు. కాగా యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో చర్చల అనంతరం విద్యుత్‌పై 25 శాతం అదనపు రుసుం వసూలుచేయాలనే ప్రణాళికను విరమించుకున్నట్లు ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ వెల్లడించారు. ఈ విషయంలో ఇరువర్గాల ప్రయోజనాలపై అమెరికాతో చర్చలు జరపడానికి ఫెడరల్ ఆర్థిక మంత్రి డొమినిక్ లెబ్లాంక్‌తో కలిసి గురువారం వాషింగ్టన్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25శాతం సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపై ఆదేశాలిస్తానని తెలిపారు. మరిన్ని రంగాల్లోనూ సుంకాలను ప్రకటిస్తామని వెల్లడించారు. 'వారు మన ఉత్పత్తులపై 130శాతం సుంకాలు విధిస్తుంటే మనం ఏమీ విధించకపోవడం సరికాదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వామ్య సంస్థల్లో ఆందోళన నెలకొంది.



### అమెరికా బెదిరించినా

## చర్చలు కుదరవ్ : ఇరాన్

అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా తాము అగ్రరాజ్యంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అక్కడి మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. 'అమెరికా ఆదేశాలు ఇవ్వడం, బెదిరించడం ఆమోదయోగ్యం కాదు. ట్రంప్‌తో చర్చలు చేపట్టే ఉద్దేశం నాకు లేదు. ఆయనకు ఇష్టమొచ్చింది చేసుకోవచ్చు' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. టెహ్రాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈమేరకు ఖమేనీకి లేఖ రాసినట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరాన్‌కు సైన్యం, ఒప్పందం అనే రెండు మార్గాలను సూచించారు. అయితే, తాను ఒప్పందానికే ప్రాధాన్యం ఇస్తానని, టెహ్రాన్‌ను దెబ్బతీయడం ఇష్టం లేదని స్పష్టంచేశారు. ఇక, ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ఇటీవల స్పందించారు. అమెరికా చర్చలు సమస్యల పరిష్కారం కంటే ఆధిపత్యమే లక్ష్యంగా ఉంటాయని విమర్శించారు. టెహ్రాన్‌ను ఎదురించలేక.. ట్రంప్ చర్చలు అనే కొత్త వ్యూహాలు నెలకొల్పుతున్నారని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

# బీసీసీఐ నిధులిచ్చేది బ్యాంకుల్లో పెట్టుకొనేందుకా?

## రాష్ట్ర సంఘాలపై సునీల్ గావస్కర్ ఫైర్



**ముంబయి:** దేశవాళీ క్రికెట్ వృద్ధి కోసం భారత క్రికెట్ బోర్డు పెద్దఎత్తున నిధులు అందజేస్తోంది. రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సబ్సిడీలను ఇస్తోంది. ఫస్ట్ క్లాస్, లిస్ట్ ఎ క్రికెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనేది బీసీసీఐ ఆలోచన. సెంట్రల్ కాంట్రాక్ట్ క్రికెటర్లు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని సమయంలో దేశవాళీలో ఆడాలని ఇప్పటికే బీసీసీఐ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా పలువురు గత రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఆడారు. క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను కొన్ని రాష్ట్ర సంఘాలు సద్వినియోగం చేసుకోకుండా.. సొమ్మును బ్యాంకుల్లో ఉంచుకొనేందుకు మొగ్గు చూపడం భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్‌కు ఆగ్రహం తెప్పించింది. ఆటగాళ్లకు భత్యాలు చెల్లించడంతో పాటు మైదానాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. "బీసీసీఐ నుంచి ప్రతి రాష్ట్ర క్రికెట్ బోర్డుకు భారీగానే నిధులు వస్తున్నాయి. వీటిల్లో ఎక్కువ భాగం రాయితీల రూపంలోనే అందుతున్నాయి. కొన్ని సంఘాలు మాత్రం వాటిని వినియోగించకుండా బ్యాంకుల్లో భద్రంగా ఉంచుకుంటున్నాయి. ఆట మెరుగుదల కోసం ఇచ్చిన వాటిని ఎందుకు వాడుకోవడం లేదు. కాబట్టి.. రంజీ మ్యాచ్‌ల్లో ఆడే టీమ్‌లకు బీసీసీఐ ఇచ్చే ఫీజులను ఇకనుంచి స్టేట్ బోర్డులే భరించగలవని అనుకుంటున్నా" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

### ముంబయి క్రికెట్ అసోసియేషన్‌లా చేయండి

"రంజీల్లో ఆడే ప్లేయర్లకు వచ్చే సీజన్ నుంచి మ్యాచ్ ఫీజును పెంచి ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. అయితే, ఐపీఎల్‌కు ఎంపికైన అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఆర్జించే దానికి.. దేశవాళీలో టాప్ ప్లేయర్ దక్కించుకొనే మ్యాచ్ ఫీజుల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆ లోటును పూరించాలంటే ముంబయి క్రికెట్ అసోసియేషన్‌ను ఇతర రాష్ట్రాల క్రికెట్ సంఘాలు ఫాలో కావాలి. బీసీసీఐ ఇచ్చే భత్యానికి సమానంగా ఆటగాళ్లకు రాష్ట్ర బోర్డులూ ఫీజును ఇవ్వగలిగితే.. డొమిస్టిక్‌లో ఆడే రోజులను బట్టి ప్లేయర్లకు మంచి మొత్తమే దక్కుతుంది. అలా చేయాలంటే బీసీసీఐ ఇచ్చే రాయితీ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి" అని సునీల్ గావస్కర్ వెల్లడించారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనలిస్టులు..

## ఐసీసీ ర్యాంకుల్లోనూ దూసుకొచ్చారు

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు భారత్, న్యూజిలాండ్ చేరిన సంగతి తెలిసిందే. తుది పోరులో కివీస్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించి కప్‌ను కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఐసీసీ ర్యాంకుల్లోనూ ఫైనలిస్ట్‌లు దూసుకెళ్లారు. మరీ ముఖ్యంగా కీలకమైన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించి జట్టు విజయం సాధించడానికి కారణమైన రోహిత్ శర్మ (756 పాయింట్లు) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని టాప్-3లోకి వచ్చాడు. వన్డే బ్యాటర్ల జాబితాలో శుభ్‌మన్ గిల్ (784) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ (770) రెండో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో తక్కువ స్కోరుకే పరిమితమైన విరాట్ కోహ్లీ (736) ఒక్క ర్యాంక్ దిగజారి ఐదుకు పడిపోయాడు. ఫైనల్‌తో సహా ఇతర మ్యాచుల్లో విలువైన పరుగులు చేసిన కేఎల్ రాహుల్ (638) స్థానం కిందికి పడిపోవడం గమనార్హం. అతడు ప్రస్తుతం 16వ ర్యాంకులో ఉన్నాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో రాణించిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (657) ఏకంగా ఆరు స్థానాలను మెరుగుపర్చుకుని రెండులోకి దూసుకొచ్చాడు. భారత చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ (650) కూడా మూడు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంకులో నిలిచాడు. శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ (680) అగ్రస్థానంలో ఉన్నాడు. రవీంద్ర జడేజా (616) మూడు స్థానాలను పైకి చేరి పదో ర్యాంక్ సాధించాడు. ఇక వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా ఒక్కడే టాప్ -10లో ఉన్నాడు. అతడు 220 పాయింట్లతో పదో స్థానంలో నిలిచాడు. అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ (296)దే అగ్రస్థానం.

# రోహిత్ కెప్టెన్సీలో ప్రత్యేకత అదే..

## మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్



వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలను టీమ్‌ఇండియా గెలుచుకుంది. రోహిత్ శర్మ నాయకత్వంలో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని నెగ్గిన భారత్.. అంతకుముందు టీ20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఇక గత వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కూ దూసుకెళ్లింది. 37 ఏళ్ల రోహిత్ భవిష్యత్తులో కొనసాగడంపై ఇప్పటికీ సందిగ్ధత నెలకొంది. రిటైర్‌మెంట్ తీసుకోవడం లేదని ప్రకటించినా.. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్ వరకూ కొనసాగడం కష్టమేనన్న వాదనా ఉంది. అయితే, అతడి కెప్టెన్సీ తీరుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా రోహిత్‌ను అభినందించాడు. సారథిగా వ్యవహరించిన తీరు అద్భుతమని కొనియాడాడు. "చాలామంది రోహిత్ కెప్టెన్సీని తక్కువగా అంచనా వేశారు. కానీ, అతడు వరుసగా రెండు ట్రోఫీలను భారత్‌కు అందించాడు. ఎంఎస్ ధోనీ తర్వాత నిలిచాడు. తన బౌలర్లను వినియోగించుకొనే తీరు, జట్టును హ్యాండిల్ చేసే విధానం బాగుంది. రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన వారితో మాట్లాడే విధానం అద్భుతం. తొలి మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాకు అవకాశం ఇచ్చాడు. ఆ తర్వాత వరుణ్ చక్రవర్తికి ప్లేస్ ఇచ్చాడు. ఆ సమయంలో తుది జట్టులో అవకాశం రానివారిని సముదాయించాడు. అదే, అతడిని అత్యుత్తమ కెప్టెన్‌గా నిలిపింది. వ్యక్తిగతంగా అతడి గురించి తక్కువగా ఆలోచిస్తాడు. జట్టు కోసం, సహచరుల కోసం ఎక్కువగా ఆలోచించే సారథి. వారిని కమ్‌ఫర్ట్‌గా ఉంచేందుకు ప్రయత్నిస్తాడు. ఎవరైనా అభద్రతాభావంతో ఉంటే సరైన ప్రదర్శన చేయలేరని రోహిత్‌కు తెలుసు. అందుకే, జట్టులో ఏ ప్లేయర్‌లోనూ అభద్రతాభావం ఉండకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటాడు. ఇలా చేయడం వల్ల నాయకుడిగా మెరుగైనట్లే. ఆ విషయంలో రోహిత్ బాగా పనిచేస్తున్నాడు" అని సెహ్వాగ్ వెల్లడించాడు.

# సన్ రైజర్స్ కొత్త జెర్సీ విడుదల



ఐపీఎల్ జోష్ మరికొన్ని రోజుల్లోనే మొదలవబోతోంది. టోర్నీలోని ఫ్రాంచైజీల సందడి మామూలుగా లేదు. హైదరాబాద్‌కు చెందిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తాజాగా అభిమానులకు బిగ్ సర్ప్రైజ్ ఇచ్చింది. ఈ సీజన్ కు గాను తమ జట్టు సభ్యులు ధరించే జెర్సీ ఫొటోలని తాజాగా విడుదల చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఇందుకు సంబంధించిన పోస్టును రిలీజ్ చేశారు. ఈ వీడియో క్షణాల్లో వైరలైంది. కుర్రాళ్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ నూతన జెర్సీలను ధరించి, తగ్గేదేలే అన్నట్లుగా ఫోజు పెట్టారు. ఇక ఈ వీడియోపై కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో సోషల్ మీడియాను ఆరెంజ్ ఆర్మీ సభ్యులు షేక్ చేస్తున్నారు. దాదాపుగా గతేడాది ధరించిన జెర్సీలానే ఉంది. ఇక గతేడాది ధనాధన్ ఆటతీరుతో మైమరిపించిన సన్ రైజర్స్.. ఈ ఏడాది తన జట్టును మరింత పటిష్టం చేసుకుంది. కోర్ టీమ్ లోని చాలామంది ప్లేయర్లను రిటైన్ చేసుకున్న సన్.. ఈ ఏడాది ఇషాన్, మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఆడమ్ జంపాలాంటి ప్లేయర్లను జట్టులోకి తీసుకుంది. దీంతో టీమ్ మరింత బలోపేతమైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతేడాది ఫటాఫట్ ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పు తిప్పలు పెట్టారు సన్ బ్యాటర్లు. ముఖ్యంగా ఆరంభంలోనే ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ.. ప్రతి బంతిని బౌండరీకి తరలించాలని ఆడుతూ, ముచ్చెటమలు పట్టించారు. హెన్రీచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి కూడా ధనాధన్ ఆటతీరుతో ఎంతో మంది బౌలర్లకు నిద్ర లేని రాత్రుళ్లను మిగిల్చాడు. ఈ ఏడాది ఇషాన్, అభినవ్ మనోహర్ లాంటి హిట్టర్లతో బలం మరింత పెరిగింది. ఇక బౌలింగ్ లో షమీ, హర్షల్, జంపా, కెప్టెన్ పాట్ కమిన్స్ రాకతో మరింత స్ట్రాంగ్ గా మారింది. ఈనెల 23ను హైదరాబాద్ లోని ఉప్పల్ మైదానం వేదికగా తమ తొలి మ్యాచ్ ను ఆడనుంది. మ.3.30 గంటలకు మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడనుంది. 2016 టైటిల్ గెలిచిన సన్.. 2018, 2024లో రన్నరప్ గా నిలిచింది. దీంతో ఈసారి మరో టైటిల్ నెగ్గాలని భావిస్తోంది.



# శుభ్‌మన్ గిల్‌కు ఐసీసీ అవార్డు

టీమ్‌ఇండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఫిబ్రవరి నెలకుగాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు దక్కించుకున్నాడు. స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), గ్లెన్ ఫిలిప్స్ (న్యూజిలాండ్)ను వెనక్కినెట్టి గిల్ ఈ అవార్డు సాధించాడు. గిల్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలవడం ఇది మూడోసారి. 'ఫిబ్రవరి నెలలో ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెల్చుకున్నందుకు నేను సంతోషిస్తున్నాను. బ్యాటర్‌గా రాణించడం, నా దేశం కోసం మ్యాచ్‌లు గెలవడం కంటే నాకు మరేది ప్రేరణ ఇవ్వదు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో కూడా బాగా ఆడా. నాకు వ్యక్తిగతంగానే కాకుండా మా జట్టుకూ ఈ సంవత్సరంలో గొప్ప ఆరంభం దక్కింది. రాబోయే క్రికెట్ సంవత్సరం కోసం ఎదురు చూస్తున్నాను. దేశం కోసం మరిన్ని మ్యాచ్‌లు గెలవాలని ఆశిస్తున్నాను' అని గిల్ పేర్కొన్నాడు. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో గిల్ 86.33 సగటుతో 259 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. నాగ్‌పుర్ వన్డేలో 87, కటక్‌లో జరిగిన మ్యాచ్‌లో 60 పరుగులు చేశాడు. ఇక, అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో గిల్ (112బీ 102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలోనూ గిల్ మంచి ప్రదర్శన చేశాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 129 బంతుల్లో 101 పరుగులు చేసి అజేయంగా నిలవడంతోపాటు జట్టుకు విజయాన్నందించాడు. ఈ యువ బ్యాటర్ పాకిస్థాన్‌పై 46 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో గిల్ ఐదు ఇన్నింగ్స్‌లో 188 పరుగులు సాధించాడు.

# రోహిత్ 2027 వన్డే ప్రపంచకప్ ఆడాలి

## రికీ పాంటింగ్



తన ఫామ్, భవిష్యత్‌పై వచ్చిన విమర్శలకు ఈ ఛాంపియన్స్ ట్రోఫీతో గట్టి సమాధానం ఇచ్చాడు కెప్టెన్ రోహిత్ శర్మ. తాను ఇప్పుడే రిటైర్ కానని స్పష్టంచేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం హిట్‌మ్యాన్ వన్డేలకు వీడ్కోలు పలుకుతాడని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆ ఊహాగానాలకు తనే చెక్ పెట్టాడు. మ్యాచ్ విజేతగా నిలిచిన అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశాడు. భవిష్యత్తు ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అని అడిగిన ప్రశ్నకు రోహిత్ నవ్వుతూ సమాధానమిచ్చాడు. తనకు భవిష్యత్తు గురించి ఇప్పుడే ఎలాంటి ప్లాన్‌లు లేవని పేర్కొన్నాడు. తన రిటైర్మెంట్ గురించి ఎలాంటి ప్రచారం చేయొద్దని, వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడే తాను రిటైర్ కావట్లేదని స్పష్టత ఇచ్చాడు. సుదీర్ఘమైన క్రికెట్ ఆడిన వారికి ఇంకా ఆడాలని ఉంటుందన్నాడు. ఈనేపథ్యంలో అతడు.. వచ్చే 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతాడా..? అనే దానిపై చర్చ కొనసాగుతోంది. ఈ అంశంపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించాడు. కెరీర్ ఓ దశకు వచ్చినప్పుడు అందరూ ఎప్పుడు రిటైర్ అవుతారని ఎదురుచూస్తారని పాంటింగ్ పేర్కొన్నాడు. "మీరు బాగా ఆడగలిగినప్పుడు ఇలాంటి ప్రశ్నలు ఎందుకో నాకు తెలియదు. వీటన్నింటినీ రోహిత్ పక్కనపెట్టి.. నేను బాగా ఆడుతున్నాను.. నాకు ఈ జట్టులో ఉండటం ఇష్టం.. నాయకత్వం వహించడం ఇష్టం అని స్పష్టంచేశాడు. అతడి మాటల్లో వచ్చే ప్రపంచకప్ ఆడాలన్న లక్ష్యం కనిపిస్తోంది. గత వన్డే ప్రపంచకప్ కోల్పోయాడు. అందుకే మరొకటి ఆడి జట్టుకు టైటిల్ ఇవ్వాలని అతడి మనసులో ఉందని నేను అనుకుంటున్నాను" అని పాంటింగ్ విశ్లేషించాడు. ఐసీసీ వైట్ బాల్ ఫార్మాట్‌లో అన్ని ట్రోఫీలను గెలుచుకోవడానికి.. రోహిత్ మరో వన్డే ప్రపంచకప్ ఆడటానికి అర్హుడని పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో రోహిత్ ఆటతీరు చూసినవారు ఎవరైనా.. అతడి కథ ముగిసిందని అనగలరా..? అని ప్రశ్నించాడు.

# ఎల్‌ఐసీలో వాటాను విక్రయించే యోచనలో ప్రభుత్వం




ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీలో వాటాను విక్రయించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో 2-3 శాతం వాటాను విక్రయించాలని యోచిస్తోంది. 2027 నాటికి పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 10 శాతానికి చేర్చాలనే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సెబీ నిబంధనల ప్రకారం.. 2027 నాటికి ఎల్‌ఐసీ తప్పనిసరిగా పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 10 శాతానికి చేర్చాల్సిఉంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే సంస్థలో 2-3 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌లో సానుకూల పరిస్థితులను బట్టి బీమా సంస్థలో వాటాను విక్రయించేందుకు కేంద్రం భావిస్తోందని సమాచారం. ఈ వాటా విక్రయాన్ని బహుళ చిన్న విడతలుగా అమలుచేయొచ్చని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. 2022 మే నెలలో ఎల్‌ఐసీ లిస్టింగ్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. ఎల్‌ఐసీలో 3.5 శాతం వాటాకు సమానమైన రూ.22.13 కోట్ల షేర్లను ప్రభుత్వం ఐపీఓ రూపంలో విక్రయించింది. ప్రస్తుతం ప్రభుత్వానికి ఎల్‌ఐసీ 96.5 శాతం వాటా ఉంది. 2-3 శాతం వాటా విక్రయం ద్వారా రూ.9,500 కోట్ల నుంచి రూ.14,500 కోట్ల వరకు నిధుల్ని సమకూర్చుకొనే అవకాశం ఉంది. 2024 మే నాటికి ఎల్‌ఐసీ కనీస పబ్లిక్ వాటా 10 శాతానికి చేర్చాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. ఆ తర్వాత ఆ గడువును 2027 మే16 కి పొడిగించింది. ప్రస్తుతం ఎల్‌ఐసీ మార్కెట్ విలువ సుమారు రూ.4.8 ట్రిలియన్లు.

# కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్ లెటర్స్.. ఈ ఏడాదీ వేతన పెంపు అప్పుడే




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్ చెల్లింపులకు సంబంధించి లెటర్స్ పంపించడం ప్రారంభించింది. 2024 సంవత్సరానికి సంబంధించి అర్హులైన ఉద్యోగులకు 85-115 శాతం మేర బోనస్‌ను చెల్లించనుంది. మెజారిటీ సంఖ్యలో ఉద్యోగులు బోనస్‌కు అర్హత సాధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వారంలోనే ఉద్యోగులకు బోనస్ లెటర్లు మెయిల్ ద్వారా అందనున్నాయి. బోనస్ చెల్లింపులు అందుకున్న ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో చెల్లింపులు జరుగుతాయి. వ్యక్తిగత పే రోల్ షెడ్యూల్ ప్రకారం ఈ చెల్లింపులు ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈసారి బోనస్ మొత్తం అధికమని పేర్కొన్నాయి. అలాగే, పనితీరు ఆధారంగా చెల్లించే వేతన పెంపు ఈ ఏడాది ఆగస్టులో చేపట్టనుంది. గతేడాది కూడా ఇదే సమయంలో వేతన పెంపు చేపట్టింది. అంతకుముందు ఏప్రిల్‌లోనే వేతన పెంపు చేపట్టినప్పటికీ.. గతేడాది నుంచి ఆగస్టుకు మార్చింది.



# స్వల్ప నష్టాల్లో సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. అమెరికాలో వృద్ధి నెమ్మదించడం, ఆర్థిక మాంద్యానికి దారి తీస్తుందనే భయాల నేపథ్యంలో దేశీయ ఐటీ స్టాక్స్ నేడు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ యాజమాన్యం నుంచి మదుపర్లలో నమ్మకాన్ని పాదుగొల్పే ప్రకటనలు రావడంతో నిన్న భారీగా పతనమైన బ్యాంక్ షేర్లు.. ఇవాళ 5 శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 74,270.81 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,102.32) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. తర్వాత స్వల్పంగా కోలుకుంది. ఇంట్రాడేలో 73,598.16 - 74,392.15 మధ్య చలించింది. చివరికి 72.56 పాయింట్ల నష్టంతో 74,029.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.40 పాయింట్లు కోల్పోయి 22,470.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70.23 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2,922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఎయిర్‌టెల్ బాటలో జియో..

# మస్క్ స్టార్‌లింక్‌తో జట్టు






ఎలాన్‌మస్క్‌కు చెందిన ఏరోస్పేస్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన డిజిటల్ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ జట్టు కట్టింది. స్పేస్‌ఎక్స్‌కు పూర్తిస్థాయి అను బంధ సంస్థగా ఉన్న స్టార్‌లింక్ సర్వీసెస్.. శాటిలైట్ ఆధారిత టెలికాం సేవలను అందిస్తోంది. వినియోగదార్లకు అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే దిశగా ఎయిర్‌టెల్ ఇప్పటికే భాగస్వామ్యం కుదుర్చుకోగా.. తాజాగా జియో అదే బాటలో నడిచింది. భారత్‌లోనూ స్టార్‌లింక్‌కు అనుమతులు లభించిన తర్వాత ఈ రెండు సంస్థలు ఆ సేవలను అందుబాటులోకి తేనున్నాయి. ఈ ఒప్పందం గురించి జియో నుంచి ప్రకటన వెలువడింది. "అందరికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందేలా చూసేందుకు ఈ భాగస్వామ్యం ఒక కీలక అడుగు. జియో బ్రాడ్‌బ్యాండ్ వ్యవస్థతో స్టార్‌లింక్‌ను అనుసంధానించడం ద్వారా మా పరిధిని మరింత విస్తరించనున్నాం. ఈ ఒప్పందం ఏఐ ఆధారిత యుగంలో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ విశ్వసనీయతను పెంచనుంది" అని పేర్కొంది. జియో తన రిటైల్ అవుట్‌లెట్లు, ఆన్‌లైన్ వేదికగా స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి తేనుంది. ఈ రెండు కంపెనీలు పరస్పరం తమ ప్రయోజనాలను అందిపుచ్చుకొని ముందుకుసాగనున్నాయని తన ప్రకటనలో పేర్కొంది. ఇక స్టార్‌లింక్‌తో ఒప్పందంపై స్పందించిన ఎయిర్‌టెల్.. భారత్‌లోని తమ కస్టమర్లకు స్టార్‌లింక్ సేవలను అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేయడం మైలురాయిగా అభివర్ణించింది. అత్యాధునిక శాటిలైట్ కనెక్టివిటీని అందించేందుకు కంపెనీ కట్టుబడి ఉందని తెలిపింది. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచస్థాయి హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు సైతం అందించేందుకు వీలుపడుతుందని వెల్లడించింది. ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్‌లలో స్టార్‌లింక్ పరికరాలను అందించడం, వ్యాపార వినియోగదారులకు ఎయిర్‌టెల్ ద్వారా స్టార్‌లింక్ సేవలు, మారుమూల గ్రామీణ ప్రాంతాలల్లోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించే అవకాశాలను ఈ కంపెనీలు అన్వేషిస్తాయి. అలాగే, స్టాక్ లింక్.. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ విస్తరణ, నెట్‌వర్క్ సామర్థ్యాల పెంపుపై పనిచేస్తుంది.

# పవన్ కళ్యాణ్ హీరోయిన్ స్టైలిష్ అవతార్

కన్నడ మూవీ 'పోర్కి' తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణిత సుభాష్. రెండో సినిమానే తెలుగులో చేసింది. 'ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో ఆకట్టుకుని గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ వెంటనే సిద్దార్థ్ హీరోగా నటించిన 'బావ' సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయిగా నటించి పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో అలరించడం వల్ల హీరోయిన్‌గా మంచి పేరు సొంతం చేసుకుంది. అయితే లక్ కలిసి రాక పోవడంతో స్టార్ హీరోయిన్‌గా ఇమేజ్‌ను దక్కించుకోవడంలో విఫలం అయింది.

పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ప్రణిత ఆ వెంటనే ఎన్టీఆర్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఇప్పటికీ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె స్టైలిష్ డ్రెస్‌లో ట్రెండీ డ్రెస్‌ల్లో ఎక్కువగా అలరిస్తూ ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ ప్రణీత సుభాష్ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె మరోసారి స్టైలిష్ అవతార్‌లో కనిపించింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో డిఫరెంట్ లుక్, స్టైల్‌తో అలరించిన ఈ అమ్మడు మరోసారి అలరించింది. క్యూట్ లుక్‌తో స్కిన్ షో చేయకుండానే ప్రణిత చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రణిత అందంకు స్టార్ హీరోలకు జోడీగా ఇప్పటికి వరుసగా సినిమాలు చేయాల్సి ఉంది. సమంత స్థాయిలో స్టార్‌డంను సొంతం చేసుకోవాలి. కానీ ఆ స్థాయిలో ప్రణితకు ఆఫర్లు రాలేదు. లక్ కలిసి రాకపోవడంతో ఈమెకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. ముందు ముందు అయినా ప్రణిత తన అందంతో అలరించి సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా అయినా నటించే అవకాశాలు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.





# వీరమల్లు హీరోయిన్ ఐటెం సాంగ్‌తో సర్‌ప్రైజ్..!

పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందుతున్న 'హరి హర వీరమల్లు' సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. వీరమల్లు సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. సినిమాను ఈ నెల చివర్లో విడుదల చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. మే నెలలో సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజాసాబ్' సినిమాలోనూ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల వాయిదాలు పడుతూ వస్తోంది. దాంతో నిధి అగర్వాల్ నటించిన రెండు పెద్ద సినిమాలు వాయిదాల మీద వాయిదాలు పడుతూ ఉండటంతో ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండు పెద్ద సినిమాల్లో నటిస్తున్న కారణంగా ఆ సినిమాల తర్వాత కొత్త సినిమాలు చేయాలని నిధి అగర్వాల్ భావిస్తుందట. అందుకే వచ్చిన చిన్నా చితకా ఆఫర్లను సున్నితంగా నిధి తిరస్కరిస్తుందని వార్తలు వస్తున్నాయి. సినిమాల్లో హీరోయిన్‌గా నటించే అవకాశాలను వద్దు అంటున్న నిధి అగర్వాల్ ఇటీవల ఒక సీనియర్ స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్‌ను చేసేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. ఆ సీనియర్ హీరో మరెవ్వరో కాదు బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్. ఈ మధ్య కాలంలో సన్నీ డియోల్‌కి గదర్ 2 తో భారీ విజయం దక్కింది. అందుకే ఆయన నటిస్తున్న జాట్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్న విషయం తెల్సిందే. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న జాట్ సినిమాలో నిధి అగర్వాల్ ఐటెం సాంగ్ చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. టాలీవుడ్ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం మార్చి 17 నుంచి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో ప్రత్యేక పాట చిత్రీకరించబోతున్నారు. అందులో సన్నీ డియోల్‌తో పాటు నిధి అగర్వాల్ కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు మాస్ ఎలిమెంట్స్‌ను జోడించేందుకు నిధి అగర్వాల్‌తో అందమైన ఐటెం సాంగ్‌ను గోపీచంద్ మలినేని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# రష్మికా మందన్నా ఆమె రికార్డునే చెరిపేస్తుందా?

రాజ్ కుమార్ రావ్-శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన %-%స్త్రీ 2%-% ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. %-%స్త్రీ%-%కి సీక్వెల్ చిత్రం కావడంతో భారీ అంచనాల మధ్య రిలీజ్ అయింది. భారీ వసూళ్లు సాధిస్తుందని అంచనాలున్నాయి? కానీ అంతకు మించి రికార్డు వసూళ్లు సాధించి హారర్ చిత్రాల్లో ఓ బ్రాండ్ గా మారిన సంగతి తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద సినిమా ఏకంగా 800 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. అయితే ఇప్పుడీ సినిమా వసూళ్లనే రష్మిక మందన్నా చిత్రం థామా టార్గెట్ చేసిందనే ప్రచారం వెలుగు లోకి వస్తుంది. ఇందులో రష్మికతో పాటు ఆయుష్మాన్ ఖురానా కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా కూడా దినేష్ విజన్ హారర్ యూనివర్స్ లో భాగంగా రూపొందుతుంది. ఆదిత్య సర్పోధర్ తెరకె క్కిస్తున్నారు. ఇది కూడా మైథలాజికల్ స్క్రిప్ట్. అశ్వథామ పాత్రను బేస్ చేసుకుని తెరకెక్కిస్తున్నారు. అశ్వథామ అంటే? కల్కి 2898 లో అమితాబచ్చన్ పోషించిన సంగతి తెలిసిందే. సినిమాలో ఈ పాత్ర ఎంతో శక్తివంతమైనది. అందులో పేరుకే ప్రభాస్ హీరో తప్ప! అమితాబ్ పాత్ర సినిమాలో ఎంత బలంగా ఉ ంటుందన్నది తెలిసిందే. అదే పాత్రను బేస్ చేసుకుని ఈ స్క్రిప్ట్ ని సిద్దం చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఆ సినిమాకి ముందుగా థామ అనే టైటిల్ కంటే? -వాంపైర్స్ ఆఫ్ విజయనగర అనే టైటిల్ ను పరిశీ లించారుట. కానీ కథకు పురాణ ఇతిహాసంతో ముడి ఉండటంతో -థామా గా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాపై దర్శక, నిర్మాతలు చాలా కాన్ఫిడెంట్ గా కనిపిస్తున్నారు. 500 కోట్ల మార్క్‌ను సునాయాసంగా చేరుకుం టుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఓపెనింగ్స్ రూపంలోనే భారీ మొత్తంలో రాబడుతుందని హిట్ టాక్ తె చ్చుకుంటే 800 కోట్లకు పైగా రాబడుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.





# సర్ ప్రైజ్ డోస్ పెంచిన కేతిక.. మరింత హీటెక్కించేలా..

యంగ్ హీరో నితిన్, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రాబోయే మాస్ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్' భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి కావచ్చి, పోస్టు ప్రొడక్షన్ దశలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ సంగీతాన్ని అందిస్తుండగా, శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక సినిమాను మార్చి 24న రిలీజ్ చేయనున్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే రెండు పాటలు విడుదలయ్యాయి, మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ నితిన్‌కు మరో హిట్ అందిస్తుందని టాలీవుడ్ వర్గాల్లో మంచి బజ్ నడుస్తోంది. సినిమాపై హైప్ పెంచేందుకు మేకర్స్ స్టెప్ అప్ చేశారు. ఇప్పటికే ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, ఆడియెన్స్‌ని కట్టిపడేస్తున్నారు. తాజాగా విడుదలైన స్పెషల్ సాంగ్ "ఆధి ధా సర్ ప్రైజు" మాస్ ఫ్యాన్స్‌ని ఆకట్టుకునేలా రూపొందించబడింది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com